# అవసరార్థులకు ఆపన్న హస్తాలు - లయన్స్ క్లబ్స్ సేవాసింహాలు

## (13 జనవరి లయన్స్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు 'మెల్విన్ జోన్స్ జన్మదినం' సందర్భంగా)

ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంధ సేవాసంస్థగా 210లకు పైగా దేశాల్లో, 46,000 క్లబ్బులు, 1.4 లక్షల స్వచ్ఛంధ లయన్ సేవకులు అనుక్షణం, 365 రోజులు, రోజుకు 24 గంటలు సమాజహిత, ప్రజాసంక్షేమ కార్యక్రమాలను తమ స్వంత నిధులను వెచ్చించి నిర్వహిస్తూ ఐక్యరాజ్యసమితి ప్రశంసలు సహితం పొందింది. ఇండియాలో 6,335 క్లబ్బులతో 2,35,000 లయన్ సభ్యులతో ప్రపంచంలోనే అతి పెద్ద సామాజిక సేవా సంస్థగా భారత్‌లో జనహిత కార్యక్రమాలను అవసరార్థులకు నిర్వహిస్తున్నది. 'వి సర్వ్' అనే నినాదంతో 'సేవలు, స్నేహాలు (సర్వీస్ అండ్ ఫెల్లోషిప్)' అనే లక్ష్య పునాదుల మీద లయన్స్ సంస్థ నిలబడి ఉంది.

1917లో నాటిన చిరు సేవా మొక్క:

'జీవితంలో స్వచ్ఛంధ సేవానిరతి ఓ భాగం కావాలని, సమాజహితమే మన మతం కావాలని, ఇవ్వడంలో ఇమిడి ఉన్న సంతృప్తి భాషకు అందని భావమని' నమ్మిన మెల్విన్ జోన్స్ 1917లో చికాగో, యుయస్‌లో ప్రారంభించిన ఒక చిన్న క్లబ్ నేడు ప్రపంచవ్యాప్తంగా రెండు వందలకు పైగా దేశాల్లో, వేల క్లబ్బులు, లక్షల జతల సేవల చేతులతో బడుగుల బతుకుల్లో చిరుదీపం వెలిగించడానికి ప్రయత్నాలు చేయడం హర్షదాయకం. ఒక నవ యువకుడు, చురుకైన, బహుర్ముఖుడైన మెల్విన్ జోన్స్ నాటిన చిరు మె?క్క నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం, అవసరార్థులను గుర్తించి నీడనివ్వడం అనే పునాదులపై లయన్స్ సంస్థ సుస్థిర సేవలు అందిస్తూ ఉన్నది.

విశ్వ మానవాళి సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నాలు:

'విజన్ ఫస్ట్' అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా వేల ఉచిత నేత్ర ఆసుపత్రులను అంతర్జాతీయ లయన్స్ సంస్థ నిర్వహించడం, దృష్టి నెలకొల్పే సమోన్నత కార్యాలను ఉచితంగా పేదలకు అందించడంతో పాటు సమాజాన్ని పట్టి పీడిస్తున్న డయాబెటిస్, పిల్లల క్యాన్సర్, పర్యావరణ పరిరక్షణ, ఆకలి తీర్చడం, దృష్టి దానం లాంటి కార్యక్రమాలను చేపట్టడం ముదావహం. సామాజిక సేవలు, మానవీయ విలువల ప్రచారాలు, ఉత్తమ పౌరుల బాధ్యతలు, స్నేహభావ విస్తరణ, అవగాహన కార్యక్రమాలు, ధనం-సమయం-మేధలను స్వచ్ఛందంగా వెచ్చించగల ఉన్నత విలువలుగల పౌరులను లయన్స్‌గా ఆహ్వానించడం లాంటి ఉత్తమ లక్ష్యాలతో ప్రపంచ దేశాల్లో లయనిజం వేళ్ళూనుకొని ఉంది.

లయన్స్ సంస్థ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్:

13 జనవరి 1879న అమెరికన్ అరిజోనాలో మెల్విన్ జోన్స్ జన్మించార. ఇల్లినాయిస్, చికాగోల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. రచనలు, సంగీతం, గాత్రం అభిరుచులు కలిగిన మెల్విన్ జోన్స్ తన 33వ ఏట చికాగోలో ఇన్సురెన్స్ ఎజెన్సీ వ్యాపారంలోకి ప్రవేశించి స్థిర పడ్డారు. చికాగో స్థానిక వ్యాపార సంఘానికి సెక్రటరీగా సేవలు అందించారు. 'ఇతరులకు స్వచ్ఛంధంగా చేయూతను ఇవ్వకుండా ఎవరు ఎదగలేరనే' అభిప్రాయాన్ని నమ్మిన మెల్విన్ జోన్స్ స్థానిక వ్యాపారరంగ మిత్రులతో కలిసి స్వచ్ఛంధ సేవా సంస్థను ప్రారంభించే కృషి చేశారు. ఇదే ఆలోచనతో 'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్స్' సంస్థను 07 జూన్ 1917న ఏర్పాటు చేసి తొలి కార్యదర్శిగా పని చేశారు. స్వచ్ఛంధ సేవను శ్వాసించిన మెల్విన్ జోన్స్, తన వ్యాపారాన్ని తగ్గించుకొని పూర్తి సమయం లయన్స్ సేవలకు వెచ్చించడం ప్రారంభించి, 'జీవితకాల సెక్రటరీ జనరల్' బిరుదును పొందారు. గులాబీల వలె నిజానికి/సత్యానికి ముళ్లు ఉంటాయని నమ్మిన జోన్స్ 1926లో సంస్థ సిఈఓ, 'గ్లోబల్ గుడ్‌విల్ అంబాసిడర్'గా పేరు తెచ్చుకున్నారు. లయనిజం వ్యాప్తికి జీవితాన్ని అంకితం చేసి పలు లయన్స్ క్లబ్బులు, వివిధ దేశాలు ప్రయాణిస్తూ లయనిజాన్ని ప్రచారం చేస్తూ 'అత్యుత్తమ సమాజ సేవకుడి'గా గుర్తింపు పొందారు. సేవల విస్తరణ నిమిత్తం 1000/- అమెరికన్ డాలర్లు దానం చేసిన లయన్స్ క్లబ్ సభ్యులకు 'మెల్విన్ జోన్స్ ఫెల్లో- యంజెయఫ్' బిరుదును అందించడమనే మంచి సాంప్రదాయం లయన్స్ సంస్థలో ఉండడం సంతోషదాయకం. ప్రపంచ లయన్ సేవకులకు ఆదర్శంగా నిలిచిన మెల్విన్ జోన్స్ తన 82వ ఏట 01 జూన్ 1961న అమరత్వం పొందారు.

విశ్వమే కుగ్రామమైన నేటి సమాజంలో స్వచ్ఛంధ సేవకుల అవసరం ఎంతగానో ఉందని, మన సమయంలో కొన్ని నిమిషాలైనా పేదల అభ్యున్నతికి వినియోగించాలనే ఆదర్శాలను మెల్విన్ జోన్స్ జీవితం మనకు తెలియజేస్తున్నది.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# బీఆర్ఎస్ ముహూర్తం అస్సలు బాగోలేదా?

హైదరాబాద్ జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సాఫీగా సాగిపోతూ.. ఎలాంటి ఆటంకాలు ఎదురైనా వాటిని ధీటుగా ఎదుర్కొంటూ దూసుకెళ్లే పరిస్థితికి భిన్నంగా.. నిత్యం ఏదో ఒక పంచాయితీ.. మరేదో ఇష్యూ.. అనుకోని పరిణామం.. ఊహించని ఎదురుదెబ్బ.. ఇలా కాలం సాగితే పరిస్థితి ఎలా ఉంటుంది? నమ్మకాలు..జాతకాలు.. ముహుర్తాల్ని ఎక్కువగా నమ్మే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఇటీవల కాలంలో ఎదురవుతున్న సవాళ్లు.. సమస్యలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎప్పుడు ఎదురుకాలేదని చెప్పాలి.

తన ఉనికి పరిమితంగా ఉన్న వేళలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమ సమయంలో తాను బలపడుతున్న వేళ.. తనకంటే ఎన్నో రెట్లు బలమైన పాలకులు ఉన్నప్పటికీ వారిని ఎప్పటికప్పుడు ఆత్మరక్షణలో పడేసేలా చేస్తూ.. వారు తన సంగతి తేల్చే వరకు విషయాన్ని రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకున్న కేసీఆర్.. ఇటీవల కాలంలో మాత్రం సై అంటే సై అన్నట్లుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాల్ని చూస్తే.. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చాలన్న నిర్ణయాన్ని తీసుకున్న నాటి నుంచి పరిస్థితుల్లో మార్పు వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో తన కుమార్తె పేరు బయటకు రావటం ఒక కీలక పరిణామంగా చెప్పక తప్పదు. ఉద్యమ సమయంలో వచ్చిన ఆరోపణలు బయటకు వినిపించకుండా చేసే విషయంలో కేసీఆర్ ప్రదర్శించిన నైపుణ్యం.. గడిచిన నాలుగైదు నెలలుగా మాత్రం చేయలేకపోతున్నారని చెప్పాలి. దీనికి తోడు.. కేసీఆర్ నోటి నుంచి తరచూ వినిపించే గీత దాటొద్దన్న మాటను తానే బ్రేక్ చేసి.. గీతలు.. హద్దుల్ని దాటేస్తున్న తీరుతో మోడీషాలు మరింత కటువుగా ఉండాలన్న నిర్ణయానికి వచ్చినట్లుగా చెబుతున్నారు. తమను సవాలు చేసేందుకు ఎవరూ సిద్ధం కాని వేళలో.. వారందరికి భిన్నంగా కేసీఆర్ తీరు ఉండటం మోడీషాలకు మంట పుట్టటంతో పాటు.. తమతో స్నేహాన్ని నటించి.. తమను దెబ్బ తీయాలన్న ఆలోచనలో ఉన్నట్లుగా వారు భావిస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే.. తమ సత్తా చాటాలన్న నిర్ణయానికి రావటంతో పాటు.. తెలంగాణలో అధికారం కోసం దేనికైనా సిద్ధమన్నట్లుగా ప్రయత్నాల్ని ముమ్మరం చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఆ మధ్యన జరిగిన బదిలీల్లో కేసీఆర్ సర్కారుకు తమ వంతు సాయం చేసే వారిపైన ఫోకస్ చేసిన కేంద్రం.. కేసీఆర్ తనకు బలమని నమ్మే వారిని తాజాగా టార్గెట్ చేసినట్లుగా చెబుతున్నారు. టీఆర్ఎస్ కాస్తా బీఆర్ఎస్ గా మారిన క్రమంలోనే ఈ పరిణామాలు చోటు చేసుకున్నట్లుగా చెప్పక తప్పదు. నిజానికి అప్పటి నుంచే కేసీఆర్ కు కష్టాలు.. ఎదురుదెబ్బలు మొదలైనట్లుగా చెబుతున్నారు. గడిచిన మూడు నెలలుగా తెలంగాణ వ్యాప్తంగా జరిగిన ఐటీ.. ఈడీ దాడులకు సంబంధించిన ఫలితాలు మరికొద్ది రోజుల్లో బయటకు వస్తాయని.. అప్పటి నుంచి రాజకీయం మరింతగా మారుతుందంటున్నారు. ఇప్పటివరకు ట్రైలర్ మాత్రమే చూపించిన మోడీషాలు తర్వలోనే తమ సినిమాను షురూ చేస్తారని చెబుతున్నారు. తాజాగా సీఎస్ సోమేశ్ విషయం లోనూ ఇలాంటి ఎదురుదెబ్బే తగిలిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. 2017లో మొదలైన వ్యవహారం ఇప్పుడే ఎందుకిలా జరిగినట్లు? అన్న ప్రశ్నను సంధించేవారు లేకపోలేదు. అందులో వాస్తవం ఎంతన్న విషయాన్ని పక్కన పెడితే.. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చిన తర్వాత నుంచే గులాబీ బాస్ కు టైం ఏ మాత్రం సెట్ కావటం లేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపించటం గమనార్హం.

# నిస్వార్థ సేవకులు పివిఎన్ చలపతిరావు

### -కర్రి వేణుమాధవ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి

విశాఖపట్నం జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);దేశంలో నిస్వార్థ ప్రజా నాయకుల్లో పివిఎన్ చలపతిరావు ఒకరిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ తెలిపారు. విశాఖపట్నం బీచ్ రోడ్ లో ఏయు ఆడిటోరియంలో ఈరోజు వారి సంతావ కార్యక్రమంలో పాల్గొన్న వేణుమాధవ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నిస్వార్థంగా సేవలు అందించిన ప్రముఖుల్లో మాజీ ఎమ్మెల్సీ జాతీయ కార్యవర్గ సభ్యులు పివిఎన్ చలపతిరావు అని వేణుమాధవ్ అన్నారు ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు గారు ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పివిఎన్ నారాయణ గారు పలువురు జాతీయ రాష్ట్ర నాయకులు అభిమానులు పాల్గొని వారి కుమారుడు ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు

# ప్రపంచంలోనే అతి పొడవైన నదీ విహార నౌక'ఎం.వి గంగా విలాస్‌ను , టెంట్ సిటీని

## జనవరి 13న వారణాశిలో ప్రారంభించనున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, జనవరి 12::ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ, 2023 జనవరి 13 వతేదీ ఉదయం 10,30 గంటలకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రపంచంలోనే అత్యంత పొడవైన నదీ విహార నౌక ఎం.వి.గంగా విలాస్‌ను, అలాగే వారణాశి లోని టెంట్ సిటీని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మరో వెయ్యి కోట్ల రూపాయల విలువగల అంతర్దేశీయ జలరవాణా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు.

ఎం.వి.గంగా విలాస్:

ఎం.వి.గంగా విలాస్ ఉత్తరప్రదేశ్ లోని వారణాశి నుంచి బయలుదేరి 51 రోజులపాటు 3,200 కిలోమీటర్ల దూరం ప్రయాణించి అస్సాంలోని దిబ్రూఘడ్‌కు చేరుకుంటుంది. మార్గమధ్యంలో ఇది 27 నదీమార్గాల మీదుగా , వివిధరాష్ట్రాలను దాటుకుంటూ బంగ్లాదేశ్ మీదుగా ప్రయాణం సాగిస్తుంది. ఎంవి గంగా విలాస్‌కు మూడు డెక్ లు 18 సూట్‌లు ఉండి 36 మందికి లక్జరీ ప్రయాణ సదుపాయాలు కలిగిఉంటుంది. ఈ నౌక తొలి ప్రయాణానికి స్విట్జర్లాండ్ నుంచి 32 మంది తమ పేర్లను మొత్తం జర్నీకి నమోదు చేసుకున్నారు.

ఎం.వి.గంగా విలాస్ క్రూయిస్, భారతదేశాన్ని ప్రపంచానికి అత్యుత్తమంగా తెలియజెప్పేలా తీర్చిదిద్దారు. 51 రోజులపాటు ప్రణాళికాబద్ధంగా సాగే ఈనౌకా విహారం లో 50 ముఖ్యమైన టూరిస్టుప్రదేశాలను , ప్రపంచ ప్రసిద్ధ వారసత్వ ప్రదేశాలను,జాతీయ పార్కులను, నదీ ఘాటల్‌ను బీహార్‌లోని పాట్నా, జార్ఖండ్‌లోని సాహిబ్ గంజ్, పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా, అస్సాంలోని గౌహతి, బంగ్లాదేశ్ లోని ఢాకాలను సందర్శించే ఏర్పాట్లు చేశారు. ఈ పర్యటన టూరిస్టులకు ఒక మధురానుభూతిని మిగిల్చేలా తీర్చిదిద్దారు. ఈ పర్యటనలో ఇండియా ,బంగ్లాదేశ్‌లకు చెందిన కళలు, సంస్కృతి, చరిత్ర, ఆధ్యాత్మికతను తెలుసుకునేందుకు వీలు కల్పిస్తుంది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా దేశంలో నదీవిహార పర్యాటకాన్ని పెంపొందించేందుకు , ఈ రంగంలోని అపార అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రస్తుతం ప్రారంభం కానున్న నౌకా విహార సర్వీసు నదీ విహార పర్యాటకరంగంలో దేశంలో కొత్తశకానికి నాంది కాగలదు.

వారణాశిలో టెంట్‌సిటీ :

వారణాశిలో గంగానది ఒడ్డున టెంట్ సిటీకి రూపకల్పన చేశారు. ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు దీనిని చేపట్టారు. ఈ ప్రాజెక్టును నగరంలోని ఘాట్‌లకు ఎదురుగా చేపట్టారు. ఇక్కడ వారణాశికి పెద్ద ఎత్తున తరలివచ్చే పర్యాటకుల సౌకర్యార్థం వసతిని ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి కాశీ విశ్వనాథ థామాన్ని ఆధునీకరించిన తర్వాత పర్యాటకులు, యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనిని వారణాశి డవలప్ మెంట్ అథారిటీ పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేసింది. పర్యాటకులు వివిధ ఘాట్‌లనుంచి టెంట్‌సిటీకి చేరుకునే వీలు కల్పించారు. టెంట్‌సిటీ ప్రతి ఏడాది అక్టోబర్‌నుంచి జూన్ వరకు ఉంచుతారు. ఆతర్వాత వర్షాకాలంలో గంగానది ప్రవాహమట్టం పెరిగే అవకాశం ఉన్నందున మూడు నెలలపాటు వాటిని తొలగిస్తారు.

దేశీయ జల మార్గ ప్రాజెక్టులు:

ప్రధానమంత్రి పశ్చిమబెంగాల్‌లోని హాల్దియు మల్టీమోడల్ టెర్మినల్‌నుకూడా ప్రారంభిస్తారు. దీనిని జలమార్గ్ వికాస్ ప్రాజెక్టు కింద అభివృద్ధిచేశారు. హాల్దియా మల్టీమోడల్ టెర్మినల్ ఏడాదికి 3 మిలియన్ మెట్రిక్‌టన్నుల కార్గో రవాణా, దిగుమతి సామర్థ్యం కలిగిఉంటుంది. 3000 డెడ్‌వెయిట్ టన్నేజ్ (డి.డబ్ల్యుటి) సామర్థ్యంగల నౌకల కార్యకలాపాలకు సరిపడిన బెర్త్‌లు ఇందులో ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్‌లోని బాలియా జిల్లాకాన్స్‌పూర్, ఘాజీపూర్ జిల్లా జమానియ, చోచక్‌పూర్, సైదాపూర్‌లలో నాలుగు ఫ్లోటింగ్ కమ్యూనిటీ జెట్టీలను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. వీటితోపాటు బీహార్ లోని పాట్నా జిల్లాలో డిఘా,నక్తా దియారా, బార్హ్, పనాపూర్, సమస్తిపూర్‌జిల్లాలోని హసన్‌పూర్‌లలో ఐదు కమ్యూనిటీ జెట్టీలకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్ జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లో గంగా నది ఒడ్డున సుమారు 60 కమ్యూనిటీ జెట్టీలను నిర్మించనున్నారు. ఇవి ఆ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడానికి, స్థానిక ప్రజల జీవనోపాధి మెరుగుపడడానికి ఉపకరిస్తాయి. చిన్న రైతులు, మత్స్యకార యూనిట్లకు , అసంఘటిత రంగంలో వ్యవసాయ ఉత్పత్తులయూనిట్లకు, పండ్లతోటల పెంపకందారులకు, పూల సాగుదారులకు చేతివృత్తుల వారికి తమ ఆర్థిక కార్యకలాపాలను మరింత పెంచుకునేందుకు, గంగానదిప్రాంతంలో తమ కార్యకలాపాలపై మరింత దృష్టిపెట్టేందుకు ఇవి ఉపకరిస్తాయి.

ప్రధానమంత్రి గౌహతిలో ఈశాన్య రాష్ట్రాల కోసం సముద్రయాన నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఇది ఈశాన్య రాష్ట్రాలలో ఉన్న

అద్భుత ప్రతిభను వెలికితీసి, వారికి నానాటికీ పెరుగుతున్న లాజిస్టిక్ పరిశ్రమలో మరింత మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దీనిని ఏర్పాటు చేస్తున్నారు.

దీనికితోడు, ప్రధానమంత్రి గౌహతిలో పాండు టెర్మినల్ లో షిప్ రిపేర్ సదుపాయానికి, ఎలివేటెడ్ రోడ్డు శంకుస్థాపన చేస్తారు. షిప్ రిపేర్ ఫెసిలిటీ ని పాండు టెర్మినల్ లో ఏర్పాటుచేస్తే నౌకల మరమ్మత్తు విషయంలో ఎంతో సమయం ఆదా అవుతుంది.

నౌకలను రిపేర్కు కోల్కతాకు తరలించి తిరిగి తీసుకురావడానికి సుమారు నెలరోజులకు పైబడి పడుతుంది. దీనివల్ల రవాణా వ్యయం చాలావరకు తగ్గదంతో. డబ్బు ఆదా అవుతుంది. పాండుటెర్మినల్ నుంచి ఎన్ హెచ్ 27 వరకు ప్రత్యేక రోడ్ ఉండడంతో 24 గంటలూ అనుసంధానత ఉంటుంది.

# ప్రజా పంపిణి వ్యవస్థ ద్వారా 2,14,890 రేషన్ కార్డుదారులకు పోర్టిఫీడ్ బియ్యాన్ని

మెదక్, జనవరి 12 నేటినిజం ప్రతినిధి):వచ్చే ఏప్రిల్ మాసం నుండి జిల్లాలోని ప్రజా పంపిణి వ్యవస్థ ద్వారా 2,14,890 రేషన్ కార్డుదారులకు 529 చౌక ధర దుకాణాల ద్వారా పోర్టిఫీడ్ బియ్యాన్ని అందించనున్నామని అదనపు కలెక్టర్ రమేష్ తెలిపారు. జాతీయ ఆహార భద్రత లో భాగంగా గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన విజిలెన్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ విటమిన్లు, మినరల్స్, ఐరన్ తో కూడిన బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం అందరు రేషన్ కార్డుదారులకు, అంగన్ వాడి కేంద్రాలకు, మధ్యాన్నం భోజన పధకానికి పాఠశాలలకు, సంక్షేమ వసతి గృహాలకు పోర్టిఫీడ్ బియ్యాన్ని అందించాలని నిర్ణయించిందని అన్నారు. ఇప్పటికే కొన్ని అంగన్వాడీ కేంద్రాలలో, వసతి గృహాలలో పోర్టిఫీడ్ బియ్యాన్ని విద్యార్థులకు అందిస్తున్నామని అన్నారు. పోషకాహార లోపం వల్ల చాలా మంది రక్తహీనత తో బాధపడుతున్నారని, పిల్లలలో వయస్సుకు తగ్గ ఎదుగుదల లేదని గుర్తించిన ప్రభుత్వం పోర్టిఫీడ్ బియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించిందని అన్నారు. జిల్లాలోని 7 మండల స్థాయి స్టాక్ పాయింట్ల ద్వారా ప్రతి నెల అంగన్వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు, సంక్షేమ వసతి గృహాలకు పోర్టిఫీడ్ బియ్యాన్ని సరఫరా చేస్తామన్నారు. . అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం తో పాటు అదనపు పోషణకు అనుబంధ ఆహారం అందించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలల్లో మధ్యాన్న భోజనం, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. బియ్యం నాణ్యతలో, పరిమాణంలో రాజీ పడవద్దని ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తేవాలని సంక్షేమ అధికారులకు సూచించారు. సరైన పౌష్టికాహారం లేక చాలా మంది పిల్లలు వయస్సుకు తగ్గ ఎదుగుదల లేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, మారుతున్న కాలానికనుగుణంగా పండ్లు, తృణ ధాన్యాలు వంటి విటమిన్లతో కూడిన అనుబంధ ఆహారం అందించవలసిన అవసరం ఉన్నదని అన్నారు. ఏ ఒక్కరు ఆకలితో చావకూడదన్నదే ఆహార భద్రత చట్టం ఉద్దేశమని ప్రజలకు, విద్యార్థులకు సేవ చేయడంలో అధికారులు అంకిత భావంతో పనిచేయాలని , ప్రపంచ దేశాలలో మంచి ఆరోగ్య దేశంగా ఉండేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిషద్ సీఈఓ వెంకట శైలేష్ డిఆర్ డిఓ శ్రీనివాస్, డిఎస్ ఓ శ్రీనివాస్, జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీ, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాణి దర్శన టికెట్లను టీటీడీ రోజుకు వెయ్యికి పరిమితం

తిరుమల జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తిరుమలలో సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనంలో మరింత ప్రాధాన్యత పెంచేందుకు వీలుగా శ్రీవాణి దర్శన టికెట్లను టీటీడీ రోజుకు వెయ్యికి పరిమితం చేసింది. ఇందులో ఆన్‌లైన్‌లో 750, ఆఫ్ లైన్ లో 250 టికెట్లను జారీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక నుంచి శ్రీవాణి దాతలకు విమానాశ్రయం లో కరెంట్ బుకింగ్ కౌంటర్‌ను అందుబాటులో ఉంచామని, బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్ట్ కౌంటర్‌లో మాత్రమే ఆఫ్‌లైన్ టిక్కెట్లు జారీ చేస్తారని వివరించారు. శ్రీవాణి దాతలు బ్రేక్ దర్శనం టికెట్‌కి బోర్డింగ్ పాస్‌ను జతచేయాలని. టికెట్ పై ఎయిర్‌లైన్ రిఫరెన్స్‌తో కూడిన పీఎన్ఆర్ నంబర్‌ను కూడా నమోదు చేయించాలని సూచించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్సులోని సిబ్బంది బ్రేక్ దర్శన టిక్కెట్‌తో పాటు బోర్డింగ్ పాసును తనిఖీ చేసి దర్శనానికి అనుమతిస్తారని చెప్పారు. మాధవం విశ్రాంతి గృహంలో శ్రీవాణి టికెట్ల కేటాయింపును టీటీడీ రద్దు చేసింది.

# మామయ్య అన్న పిలుపూ...

అమరావతి జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మామయ్య అన్న పిలుపుతో చంద్రబాబునాయుడు పులకించిపోతున్నారు. నిజానికి ఆయన ఏమైనా వినని పిలుపా అది అంటే కానే కాదు. నందమూరి సోదరులు బాబుకు బావమరుదులు అయితే వారి కుమారులు కుమార్తెలు బాబుని మామయ్య అనే పిలుస్తారు. అలా ఒక బహు చక్కని కుటుంబ బంధని నారా నందమూరిల మధ్యన ఉంది. అయితే మామయ్య అని ఎందరు అన్నా కూడా చంద్రబాబుకు అమితానందం కలిగించే ఆ పిలుపే వేరు. అదే జూనియర్ ఎన్టీయార్ మేనల్లుడు నుంచి మామయ్యా అని అనిపించుకుంటే ఆ ఆనందం వేరు. అది ఇన్నాళ్లకు సార్థకం అయింది. ఇదివరకు జూనియర్ చంద్రబాబుని మామయ్యా అని పిలిచేవారు. వారి కుటుంబ బంధం అలాగే ఉంది. కానీ మధ్యలో వచ్చిన రాజకీయాల వల్ల గ్యాప్ వచ్చిందని బయటకు అంతా అనుకుంటున్నారు. అందులో ఎంత నిజముందో తెలియదు కానీ చంద్రబాబు అంటే జూనియర్ కి అభిమానం అని మరోసారి రుజువు చేసుకున్నారు. మామయ్య థాంక్స్ అంటూ జూనియర్ పలికిన ఆ పలుకులు ఒక్క బాబునే కాదు మొత్తం తెలుగుదేశం పార్టీ తమ్ముళ్లకే ఆనందం కలిగించాయి అని చెప్పాలి. ఇంతకీ మ్యాటర్ ఏంటి అంటే నాటు నాటు సాంగ్ కి గోల్డెన్ క్లబ్ ప్రతిష్టాత్మకమైన అవార్డు లభించింది. దాంతో చిత్ర బృందాన్ని దేశ ప్రధాని నుంచి ముఖ్యమంత్రి జగన్ నుంచి అంతా అభినందించారు. ఇక చంద్రబాబు కూడా కంగ్రాట్స్ చేస్తూ ట్వీట్ చేశారు. దాంతో బాబు ట్వీట్ కి జూనియర్ రీ ట్వీట్ చేశారు. నిజానికి టోటల్ చిత్రబృందాన్ని కలుపుకుని చంద్రబాబు ట్వీట్ చేసినా ప్రత్యేకంగా జూనియర్ ఎన్టీయార్ థాంక్యూ మామయ్యా అంటూ రీ ట్వీట్ చేయడం మాత్రం రాజకీయంగానూ చర్చకు తావిస్తోంది. చంద్రబాబు పుట్టిన రోజున కానీ లేక జూనియర్ బర్త్ డే నాడు కానీ ఇలా ఒకరికి ఒకరు గ్రీట్ చేసుకున్న సందర్భాలు లేవు.

కానీ ఇపుడు సడెన్ గా జూనియర్ నుంచి చుట్టరికాలు కలుపుతూ ఆప్యాయంగా మామయ్యా అంటూ ట్వీట్ జూనియర్ నుంచి రావడంతో తెలుగు తమ్ముళ్ల సంతోషం పట్టరానిది అవుతుంది. అఫ్ కోర్స్ ప్రధాని మోడీకి సీఎం జగన్ కి కూడా జూనియర్ ధన్యవాదాలు తెలుపుతూ రీ ట్వీట్ చేశారు. కానీ ఇక్కడ జూనియర్ చంద్రబాబుల మధ్య బంధం ప్రత్యేకమైనది. అందుకే ఈ రీట్వీట్ తెగ వైరల్ అవుతోంది. ఇదిలా ఉంటే జూనియర్ ఎన్టీయార్ చంద్రబాబు త్వరలో భేటీ అవుతారు అంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. సోషల్ మీడియా అయితే అదే నిజమంటూ ప్రచారం చేసి పారేసింది. దాన్ని కాస్తా నిజం చేసేలా జూనియర్ నుంచి రీ ట్వీట్ రావడం శుభ సంకేతంగా అంతా భావిస్తున్నారు. జూనియర్ అమెరికా నుంచి రాగానే బాబుతో ఆయన భేటీ ఉంటుందా అంటే ఏమో అదే నిజం కావచ్చు అంటున్నారు. మొత్తానికి తెలుగుదేశానికి మంచి రోజులు వస్తున్నాయని అందుకే ఇలా వరసబెట్టి సంఘటనలు జరుగుతున్నాయని అంతా అంటున్నారు.

# సంక్రాంతి పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలి



హైదరాబాద్ జనవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సంక్రాంతి పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలి. కానీ పండగ సందర్భంగా ఎగురవేసే.. పతంగుల వల్ల పర్యావరణం, పక్షులకు హాని జరగకుండా చూడాలని అటవీ శాఖ కోరింది. పతంగులతో పాటు పక్షులనూ ఎగరనిద్దాం అనే నినాదంతో పండగ జరుపుకోవాలని అటవీశాఖ పిలుపునిచ్చింది. నైలాన్, సింథటిక్ మాంజా (చైనీస్ మాంజా) వాడకం వల్ల అనర్థాలపై అందరూ అవగాహన కలిగిఉండాలని అటవీ శాఖ కోరింది. పతంగులను ఎగుర వేసేందుకు ఉపయోగించే చైనీస్ మాంజా (చైనా దారం) వల్ల తీవ్ర అనర్థాలు జరుగుతున్నాయని అటవీ శాఖ తెలిపింది. కేంద్ర పర్యావరణ చట్ట ప్రకారం చైనీస్ మాంజా వాడకాన్ని నిషేధించినట్లు అటవీ శాఖ తెలిపింది. (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు ? 2016 ప్రకారం). కైట్స్ ఎగరవేసేందుకు గ్లాస్ కోటింగ్ తో ఉన్న నైలాన్ , సింథటిక్ తాడును కొందరు వాడుతున్నారు. పండగ తర్వాత ఎక్కడికక్కడ ఈ వ్యర్థాలు మిగిలిపోయి పర్యావరణం, పక్షులకు హాని జరుగుతోంది. దారంలో చిక్కుకున్న పక్షులు విలవిల్లాడి, చనిపోతున్నాయి. మనుషులు కూడా గాయపడుతున్నారు. చైనీస్ మాంజా బదులు సంప్రదాయ కాటన్ దారాలను పతంగుల కోసం వాడాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్ ఉ హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్ సూచించారు. సంక్రాంతి పండగ సీజన్ లో దేశవ్యాప్తంగా జరిగే సంఘటనల్లో చైనీస్ మాంజా బారినపడి మరణాలు నమోదవుతున్న విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రం లో కూడా చైనా మాంజా వినియోగాన్ని నిషేధించామని పీసీసీఎఫ్ వెల్లడించారు. పోలీసులతో పాటు ఇతర శాఖలతో సమన్వయంతో మాంజా వాడకాన్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చైనీస్ మాంజా అనర్థాలపై ప్రచారం చేయటంతో పాటు, ఎన్‌జీవోల సహకారంతో స్కూలు పిల్లలతో పాటు అందరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. చైనా మాంజా అమ్మినా, నిలువ, రవాణా చేసినా ఐదేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల దాకా జరిమానా ఉందని, మాంజా వాడకం వల్ల మనుషులకు, పక్షులకు హాని జరిగితే 3 నుంచి 7 ఏళ్ల దాకా జైలు శిక్ష రూ. 10 వేల జరిమానా ఉంటుందన్నారు. గత కొన్నేళ్లుగా 28 లక్షల రూపాయల విలువైన 1391 కిలోల దాకా చైనీస్ మాంజా సీజ్ చేశామని అధికారులు తెలిపారు. చైనా దారం దిగుమతి వల్ల స్థానికంగా కాటన్ తో పంతుగుల దారం తయారు చేసేవాళ్లు ఉపాధి కూడా కోల్పోతున్నారు. చైనా మాంజా రవాణా చేస్తే వాహనాలు కూడా సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. పండగ సీజన్ లో నిఘా కోసం ప్రత్యేకంగా ఐదు టీమ్ లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# శక్తి, యుక్తి యువత ఘనత..

## కృషి, పట్టుదలతో బంగారు భవిత

### -పొగాకు నియంత్రణ ఐకాన్ మాచన రఘునందన్

హైదరాబాద్ జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );యువత తన అపార శక్తి, యుక్తి ని ఉజ్వల భవితకు బంగారు బాట వేసుకోవాలి.. కానీ దురలవాట్ల కు లోనూ కావద్దనీ పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్, పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహిత మాచన రఘు నందన్ సూచించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ..18 ఏళ్లకు ప్రజా ప్రతినిధి ని ఎన్నుకునే హక్కు కలిగి ,తమను నడిపించగల నాయకుణ్ణి ఎంపిక చేసే వివేకం విచక్షణ లు యువత లో ఉన్నా యన్నారు, కానీ అనవసర దురలవాట్లకు బానిసై జీవితం లో రన్ ఔట్ దిశగా అడుగులు వేయడం ఔచిత్యం కాదన్నారు. ప్రబల మైన శక్తి యువత సొంతం అని, దూరాలోచన తో చక్కటి లక్ష్యం ఏర్పరచుకావాలని అభిలాశించారు. కన్న వారు, ఉన్న ఊరు, గర్వించ దగ్గ వ్యక్తులుగా సమాజం లో చక్కటి గుర్తింపు పొందాలని సూచించారు. అటు నాయకత్వం లో గాని, ఇటు సేవా రంగం లో గానీ తమ కంటూ ఓ విశిష్ట స్థానాన్ని కైవసం చేసుకోగల సామర్థ్యం యువత లో పుష్కలం అని అభిప్రాయ పడ్డారు. తాము చదువుకున్న పాఠశాలకు గాని, కళాశాలలో గాని జరిగే కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యే లా.. ఓ సముచిత, సమున్నత స్థానం యువత దక్కించుకోవాలని సూచించారు.

# మద్యం ప్రియులు షాక్.. ఒక పెగ్గు తాగిన కష్టమేనట

హైదరాబాద్ జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మద్యాన్ని మోతాదుకు మించి తాగితే అది మంచిది కాదని అందరికీ తెలిసిన విషయమే. వైద్యులు సైతం ఇదే విషయాన్ని ధృవీకరిస్తుంటాయి. అయితే రోజుకు ఒక పెగ్గు లేదా 90 ఎంఎల్ మద్యం తాగితే అది ఆరోగ్యానికి మంచిదే కానీ చెడు కాదనేది ప్రచారంలో ఉంది. అయితే ఆ మాట తప్పని తాజాగా జరిగిన ఓ అధ్యయనంలో వెల్లడి కావడంతో మద్యం ప్రియులు షాకవుతున్నారు. ఒకప్పుడు ఏమో కానీ.. ఇప్పుడైతే మద్యం అలవాటు లేని వాళ్ళు ఉన్నారంటే మాత్రం ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేయాల్సిందే. ఎందుకంటే మద్యం తాగడం అనేది ప్రస్తుత రోజుల్లో కల్చర్ గా మారిపోతుంది. ప్రతీ అకేషన్లోనూ మద్యానికి ప్రాధాన్యం లభిస్తోంది. పెళ్లి రోజైన.. పుట్టిన రోజైన.. గెట్ టు గెదర్ అయినా ఇలా ఏది తీసుకున్నా మద్యం లేకుండా పార్టీలు జరగడం లేదు. అన్నిచోట్ల ఇదే ట్రెండ్ కొనసాగుతుందని కాదు గానీ మెజారిటీ మాత్రం మద్యం లేకుండా పార్టీలు జరగడం అనేది నేటి రోజుల్లో కన్పించడం లేదు. టీనేజ్ వయస్సు నుంచే పోరగాళ్ళు బీర్లు.. బీజర్లు అంటూ నానా రచ్చ చేస్తున్నాయి. ఆడవాళ్లు సైతం మేము ఏం తక్కువ కాదంటూ డ్రంకన్ డ్రైవ్ లో సైతం అడ్డంగా బుక్కయితున్న ఘటనలు ఇటీవల కాలంలోనే అనేకం ఉన్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో మద్యానికి ఉన్న డిమాండ్ మరెక్కడ లేదేమో. మద్యం మీదే ప్రభుత్వాలు సైతం ఆధారపడుతున్నాయి. ఈ క్రమంలోనే మద్యం బాబులు వీఆర్ టాక్స్ ప్లేయర్స్ అంటూ మద్యం మత్తులో కాలేరేజిరేసి మరీ చెబుతునారు. అయితే మద్యం విషయంలోనే కాదు ఏదైనా సరే అతి అనర్థదాయకం అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. . ఈ సూత్రం మద్యానికి కూడా వర్తిస్తుంది. అందుకే కొందరు మద్యాన్ని చాలా లిమిట్ తీసుకుంటూ తమ జీవితంలో మద్యాన్ని ఒక భాగం చేసుకుంటున్నారు. రోజుకు ఒకటి అర పెగ్గులతో సంతృప్తి చెందుతున్నారు. వైద్యులు సైతం ఒకటి అర పెగ్గు తాగితే పర్వలేదనే చెబుతుంటారు. అలాంటి ఓ అధ్యయనంలో మాత్రం రోజుకు ఒక పెగ్గు తాగిన కష్టమేనని తేలిందట. క్వాలిటీతో సంబంధం లేకుండా రోజుకు ఏ రకమైన మద్యం తాగిన రోగాల బారిన పడటం ఖాయమని తేల్చారు. ఇది క్యాన్సర్ కు కారణం అవుతుందని కూడా వెల్లడైందట. అలాగే గుండె సంబంధిత.. టైప్-2 డయాబెటిస్ వారికి మద్యం మేలు చేస్తుందని ఆధారాలు ఏమి లేవని తేలిందని పేర్కొన్నారు.

# ఎవరు ఈ శాంతికుమారి? ఎలా ఫైనల్ అయ్యారు?

హైదరాబాద్ జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న సోమేశ్ కుమార్ గంటల వ్యవధిలో తన పదవి నుంచి తప్పుకోవాల్సిన అవసరం రావటం.. ఏపీకి వెళ్లటం ఖాయం కావటం తెలిసిందే. దీంతో.. సోమేశ్ స్థానంలో మరొకరిని ఎంపిక చేసుకునే విషయంలో భారీ కసరత్తు జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ రేసులోకి బోలెడన్ని పేర్లు వచ్చాయి. వాటన్నింటిని దాటుకొని.. చివరకు సీఎస్ గా బాధ్యతలు చేపట్టే అరుదైన అవకాశాన్ని శాంతికుమారి సొంతం చేసుకున్నారు. మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన ఆమె తన కెరీర్ ను 1991లో షురూ చేశారు. అంటే.. థర్టీ ప్లస్ ఇయర్స్ ఇండస్ట్రీ అన్న మాట.

కొత్త సీఎస్ ఎవరన్న మాట వినిపించినంతనే తెర మీదకు వచ్చిన పేర్లు చాలానే వచ్చాయి. వాటిల్లో రజత్కుమార్ కె.రామకృష్ణారావు అర్వింద్ కుమార్ సునీల్ శర్మ రాణి కుముదిని పేర్లు ప్రముఖంగా వినిపించాయి. వీరి పేర్ల తర్వాతనే శాంతికుమారి పేరు వినిపించింది. అయితే.. జాబితాలో తన కంటే ముందున్న పేర్లకు సంబంధించిన నెగిటివ్ అంశాలు శాంతికుమారికి ప్లస్సులుగా మారాయి. కొన్నిసార్లు కాలం కలిసి రావటం అన్న మాట వినిపిస్తూ ఉంటుంది. శాంతికుమారి విషయంలో అదే నిజమైందని చెప్పాలి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అడవులు.. పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆమె.. తాజాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా.. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులందరికి మేడమ్ బాస్ కానున్నారు.

ఇక.. రేసులో ఉన్న వారు ఎలా వెనక్కి వెళ్లిపోయారన్న విషయాన్ని చూస్తే.. కాలం కలిసి వచ్చినప్పుడు అన్నీ ఇలానే జరుగుతాయన్న భావన కలుగక మానదు. జాబితాలో వినిపించిన రజత్ కుమార్ కె.రామకృష్ణారావు అర్విందుమార్ సునీల్ శర్మ వసుధా మిశ్రా రాణి కుముదిని వారి విషయాల్లోకి వెళితే..

వసుధా మిశ్రా

1987 బ్యాచ్ కు చెందిన ఆమె.. సీఎస్ ఎంపికలో అందరికంటే సీనియర్. అయితే.. ప్రస్తుతం ఆమె కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. వచ్చే నెలలోనే రిటైర్ కావాల్సి ఉంటుంది. అలాంటి వేళలో.. హడావుడిగా కేంద్ర సర్వీసుల్ని తీసుకొచ్చి.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టటంలో అర్థం లేదన్న ఉద్దేశంతో మొదట్లోనే ఆమె పేరును పక్కన పెట్టేశారు ముఖ్యమంత్రి కేసీఆర్.

రాణి కుముదిని

1988 బ్యాచ్ కు చెందిన రాణి కుముదిని ప్రస్తుతం రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పనా శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది జులైలో ఆమె రిటైర్ కానున్నారు. అంటే.. సీఎస్ గా ఆమెకు బాధ్యతలు అప్పజెబితే.. ఆర్నెల్లకే మరో సీఎస్ ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఆమె బాధ్యతలు చేపట్టి.. అందులో సెట్ అయ్యేసరికే నెల పడుతుంది. మరి.. ఐదు నెలలకే రిటైర్ కావాల్సి ఉండటంతో ఆమె ప్రాధాన్యతను కేసీఆర్ పరిగణలోకి తీసుకోలేదన్న మాట వినిపిస్తోంది.

రజత్ కుమార్

ఈ సీనియర్ ఐఏఎస్ అధికారికి ముఖ్యమంత్రి కేసీఆర్ తో మంచి అనుబంధం ఉంది. అయితే.. ఆయన తన కుమార్తె పెళ్లి విషయంలో పెట్టిన ఖర్చు ఆ మధ్యన పెను సంచలనంగా మారి.. రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అంతేకాదు.. రజత్ కుమార్ మీద పలు ఆరోపణలు ఉండటం కూడా ఆయనకు మైనస్ అయ్యింది. దీనికి తోడు ఆయన బిహార్ కు చెందిన వారు కావటం కూడా శాపమైంది. తెలంగాణ రాష్ట్రంలో బిహారీ అధికారుల హవా నడుస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తరచూ ప్రస్తావిస్తున్నవేళ.. బిహార్ కు చెందిన సోమేశ్ స్థానంలో మరో బిహార్ అధికారికి సీఎస్ ఇవ్వటం ఇష్టం లేకనే ఆయన పేరును పక్కన పెట్టేసినట్లుగా చెబుతున్నారు.

అర్వింద్ కుమార్

ప్రస్తుతం ఆయన పలు కీలక శాఖల్లో పని చేస్తూ.. కేసీఆర్ కు అత్యంత సన్నిహితుడు అయినప్పటికీ.. ఆయన కూడా బిహార్ కు చెందిన వారు కావటం మైనస్ గా మారిందం టున్నారు. ఇక.. రామక్రిష్ణారావు.. సునీల్ శర్మ విషయాల్లో ఉన్న కొన్ని ఇబ్బందుల్ని పరిగణలోకి తీసుకొని వారిని ఎంపిక చేయలేదన్న మాట వినిపిస్తోంది. అదే సమయంలో శాంతికుమారితో గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కు తెలిసి ఉండటం. ఆమె పని తీరు మీద ఆయనకు అవగాహన ఉంది. దీనికి తోడు సీఎంవోలోనూ ఆమె పని చేశారు. దీనికి తోడు ఆమె రెండు తెలుగు రాష్ట్రాల్లో బలమైన కాపు/ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు కావటంతో ఆమె పేరును ఫైనల్ చేసినట్లుగా చెబుతున్నారు.

# సీఎస్ శాంతి కుమారికి అభినందనలు తెలిపిన అర్వింద్ కుమార్



హైదరాబాద్ :జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా భాధ్యతలు స్వీకరించిన శాంతి కుమారిని బి.ఆర్.కే.ఆర్. భవన్‌లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ & రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

# టీడీపీ నేత ఎం.ఎస్ రాజు అరెస్ట్ ను ఖండించిన పీతల సుజాత

**– రాజుకు ఏం జరిగినా ముఖ్యమంత్రి జగన్, డీజీపీ లాదే బాధ్యత**

ఏలూరు జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: టీడీపీ నేత ఎం.ఎస్ రాజు అరెస్ట్ ను మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నేత పీతల సుజాత ఖండించారు. దళితుల హక్కుల కోసం ఛలో కావలికి పిలుపునిచ్చిన టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు ను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం పోలీసు మ్యాన్యువల్‌కు విరుద్ధమన్నారు. ఎంఎస్ రాజుకు ఏం జరిగినా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిదే బాధ్యత అన్నారు. ఎం.ఎస్ రాజు ఎక్కడ ఉన్నారో తెలియకుండా వివిధ మార్గాల్లో తిప్పుతూ కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని వింజమూరు, సీతారామపురం, సోమశిలలోని పలు స్టేషన్లో ఉంచుతూ నిద్రాహారాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించకుండా గూండాల్లాగా వ్యవహరించడం దారుణమన్నారు. దళితులకు అండగా నిలుస్తుండటాన్ని జీర్ణించుకోలేకే ప్రభుత్వం పోలీసుల్ని అడ్డుపెట్టుకుని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ దళిత ద్రోహిగా మారి అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎంఎస్ రాజును వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు.

# రాజమహేంద్రవరంలో 'బ్రహ్మముడి' సీరియల్ తారాగణం సంక్రాంతి సందడి




రాజమహేంద్రవరం జనవరి 12 (ఎక్స్ ప్రెస్ నేవేస్ );సంక్రాంతి సంబరాలలో సందడి తెలుగింటి పండుగ సంక్రాంతి. లోగిళ్లలో ఆడపిల్లలు వేసే ముగ్గులు... వాటిపై అందంగా అలంకరించబడిన గొబ్బిళ్లు... హరిదానుల కీర్తనలు... కుర్రకారును రంజింపజేసే కోడిపందాలు, గాలిపటాలు... ఎన్నో, ఎన్నెన్నో విశిష్టతలు. సంప్రదాయ వైభవానికి ప్రతీకలన్నట్లుగా ప్రతి ఇంటా సంబరాలు జరుగుతుంటాయి. ఆధునికత పేరిట ఆశలు అంతరిక్షంలో ఉన్నా, మనవైన మూలాలను గుర్తుచేసే సంక్రాంతి వస్తుందంటే సంబరాలు పండుగకు వ ం ం ద ం గా నే ప్రారంభమైపోతుంటాయి. అచ్చ తెలుగు పల్లెల్లో కనిపించే ఈ పండుగ వైభవాన్ని సిటీజనులకు రుచి చూపడానికి స్టార్ మా ఇప్పుడు సంక్రాంతి ఫెస్టివల్‌ను రాజమండ్రిలో నిర్వహించింది. గురువారం ఉదయం రాజమండ్రిలోని సుబ్రమణ్య మైదాన్‌లో నిర్వహించిన ఈ వేడుకలలో త్వరలో స్టార్‌మా లో ప్రసారం కానున్న 'బ్రహ్మముడి' సీరియల్ తారాగణం సందడి చేసింది. రాజమహేంద్ర వరం వాసులతో పూర్తిగా మమేకమైన 'బ్రహ్మముడి' తారాగణం, వారితో కలిసి రంగవల్లులు వేశారు. గాలి పటాలను ఎగురవేయడమే కాదు, పండుగకు ముందుగానే సంక్రాంతి లక్ష్మి శోభను నగరానికి తీసుకువచ్చారు. బిగ్‌బాస్, కోయిలమ్మ ఫేమ్ మానస్, దీపిక రంగరాజు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సీరియల్‌లో బిగ్‌బాస్ ఫేమ్ హమీదా కూడా ఓ కీలకపాత్రలో నటిస్తుంది. ఈ సీరియల్ జనవరి24వ తేదీ నుంచి ప్రతి రోజూ 7.30 గంటలకు సోమవారం నుంచి శనివారం వరకూ ప్రసారం కానుంది. సంపన్నులైన దుగ్గిరాల కుటుంబానికి ముగ్గురు వారసులు. పెద్దవాడు రాజ్యవర్ధన్. తాను చేసే పని ఏదైనా సరే ఓ స్టేటస్ ఉండటం మాత్రమే కాదు, పర్‌ఫెక్ట్‌గా చేయాలని కోరుకుంటాడు. కానీ అతనికి తాను చేసుకునే అమ్మాయి మంచి ముత్యం లాంటిది కావాలనేది కోరిక. రెండోవాడు రాహుల్. ప్లేబాయ్. మూడోవాడు కళ్యాణ్. కవితాలోకంలో విహరిస్తుంటాడు. ఈ కుటుంబానికి తన కూతుళ్లను కోడళ్లుగా చేయాలని తలిచే ఓ మధ్యతరగతి తల్లి ప్రయత్నాలు, ఆ క్రమంలో చోటు చేసుకునే సంఘటనల సమాహారం 'బ్రహ్మముడి'. ఉత్కంఠత రేపే కథనం, భావోద్వేగాలను తట్టి లేపే సంభాషణలతో ఈ సీరియల్ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. జనవరి24వ తేదీ నుంచి ప్రతి రోజూ 7.30 గంటలకు సోమవారం నుంచి శనివారం వరకూ ప్రసారం కానుంది.

# 'యువశక్తి'.. ఓటు బ్యాంకుగా మారేనా...?

అమరావతి జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏపీలో అన్ని కీలక పార్టీలూ జపిస్తున్న ఏకైక మంత్రం యువశక్తి. దేశంలో యువ శక్తి పెరిగిందని.. దీనిని రాజకీయంగా వాడుకోవాలని.. ఒకవైపు టీడీపీ ప్రయత్నాలు చేస్తోంది. ఆది నుంచి కూడా చంద్రబాబు యువతకు పెద్దపీట వేస్తానని చెబుతున్నారు.

అంతేకాదు.. పార్టీ పదవుల్లోనూ 33 శాతం వారికి కేటాయిస్తానని చెప్పారు. అయితే.. దీనిని ఎంతవరకు ? అమలు చేశారనేది పక్కన పెడితే.. యువతకు మాత్రం పెద్దపీట వేస్తానని చెబుతున్నారు. ఇక ఇప్పుడు పవన్ కూడా ఇదే ఫార్ములాను ఎంచుకున్నారు. యువతకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు.. ఈ క్రమంలోనే శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో యువశక్తి పేరిట భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు.

అయితే.. యువ శక్తికి కొదవలేని మాట వాస్తవమే అయినా.. సభలు సమావేశాలకు వారు వస్తున్నది కూడా నిజమే అయి నా.. వారిని ఓటు బ్యాంకుగా మార్చ డంలో ఈ పార్టీలు విఫలమవుతున్నాయి. ఉదాహరణకు గత ఎన్నికల్లో యువత పెద్దగా ఓటు వేయలేదు. గ్రామీణ ప్రాంతంలోనే ఎక్కువగా ఓ ట్లు పడ్డాయి. అది కూడా పెద్దలు వయోవృద్ధులు మాత్రమే ఓటు వేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా యువత అదే పంథాలో ఉంటుందని మేథావులు చెబుతున్నారు. యువశక్తి ఉన్నప్పటికీ..

రాజకీయాల వైపు మొగ్గు చూపుతున్న వారు చాలా తక్కువ. వారిలోనూ ఓటు వేస్తున్నవారు ఇంకా తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో యువ శక్తిని ఓటు బ్యాంకుగా మార్చుకునే ప్రయత్నాలు చేసే వరకు పార్టీలకు ప్రయోజనం ఉండదని అంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలు యువతను ఓటు బ్యాంకుగా మార్చే ప్రయత్నాలు సాగాల్సిన అవసరం ఉందని ఆ దిశగా పవన్ వంటి వారు ప్రయత్నాలు చేయాలని సూచిస్తున్నారు. మరి ఏం చేస్తారో చూడాలి.

# మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వి శిఖండి రాజకీయాలు

**–అక్రమ కేసులపై మండిపడ్డ చంద్రబాబు**

చిత్తూరు జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పుంగనూరు లో టీడీపీ నేతలపై పెట్టిన అక్రమ కేసులపై ఆ పార్టీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వి శిఖండి రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పుంగనూరులో పెద్దిరెడ్డి పని అయిపోయిందని జోస్యం చెప్పారు. దూసుకొస్తున్న పసుపు సైన్యాన్ని ఎదుర్కోలేక.. పోలీసుల సహకారంతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. 10 రోజుల్లో 5 ఎఫ్ఐఆర్?లు రాయించి 80 మందిపై కేసులు పెట్టారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని పెద్దిరెడ్డి తెలుసుకోవాలని చంద్రబాబు హెచ్చరించారు. మంత్రి పెద్దిరెడ్డి నోటి నుంచి తరచూ వినిపిస్తున్న మాట 'టార్గెట్ కుప్పం'. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో విజయం సాధించాలని ఎవరైనా లక్ష్యంగా పెట్టుకోవచ్చు. అయితే వైసీపీ సర్కారు అనుసరిస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ శ్రేణులను, మహిళా కార్యకర్తలను చితకబాదుతూ, ఎదురు కేసులు పెడుతున్నారు. 'టార్గెట్ కుప్పం' అంటే అరాచకం సృష్టించడమనే భావన వ్యక్తమవుతోంది. చంద్రబాబు పర్యటనలో సభలు జరగకుండా పోలీసులు అడ్డుకున్నారు. జీవో1ను సాకుగా చూపారు. టీడీపీ కార్యకర్తలు ధిక్కరించడంతో గద్దూరు, గొల్లపల్లెల్లో లాఠీలతో విరుచుకుపడ్డారు. మగ పోలీసులే మహిళలను చేతులతో చుట్టేసి అడ్డుకున్నారు. పైగా దెబ్బలు తిన్నవారి మీదే ఎదురు కేసులు పెట్టారు. టీడీపీ ప్రచార రథాన్ని అదుపులోకి తీసుకుని ఇంకో కేసు పెట్టారు.

# కేటీఆర్ మరిచిపోయిన 'మునుగోడు'..

నల్లగొండ జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);"మునుగోడులో టీఆర్ ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే.. ఆ మరుక్షణం నుంచి దీనిని బాగు చేసే బాధ్యతను నేను తీసుకుంటా. నేనే ఎమ్మెల్యేగా మారి.. ఇక్కడ మీకు అభివృద్ధి ఫలాలను అందిస్తాను"– ఇదీ..గత ఏడాది నవంబరు 3న జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం ఉప ఎన్నిక సమయంలో మంత్రి కేటీఆర్ ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీ.. ఎన్నికల ప్రణాళిక మేరకు ఆయన చేసిన ప్రకటన. అయితే.. ఎన్నికలు అయిపోయి మునుగోడు ఫలితం వచ్చేసి.. ఈ నెల 6వ తేదీకి రెండు మాసాలు పూర్తిగా గడిచిపోయాయి. కానీ ఇప్పటి వరకు ఇక్కడ కేటీఆర్ పర్యటించిన పాపాన పోలేదని ఇక్కడి ప్రజలు గుసగుస లాడుతున్నారు. ఎన్నికలకు ముందు.. ఈ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని.. తన నియోజకవర్గం సిర్సిల్లా మాదిరిగా.. తీర్చిదిద్దుతానని.. తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తానని... కూడా కేటీఆర్ చెప్పారు. అదేసమయంలో పోడు వ్యవసాయం.. ఎస్టీలకు సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మరి కేటీఆర్ మాటలపై నమ్మకం ఉంచిన ఇక్కడి ప్రజలు త్రిముఖ పోటీలో కూడా.. టీఆర్ ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్రెడ్డిని గెలిపించారు. అయితే ఇప్పటి వరకు ఎమ్మెల్యే కూసుకుంట్ల ఒక్కసారి మాత్రమే ఇక్కడ పర్యటించారు. ఇక ఎన్నో హామీలు ఇచ్చిన కేటీఆర్ మాత్రం ఇక్కడ కనిపించడం మానేశారు. ఈ చర్చ ఎందుకు తెరమీదికి వచ్చిందంటే.. మరో ఆరు మాసాల్లో తెలంగాణ ఎన్నికలకు రంగం రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే.. ఇక్కడి ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేయరా? అనేది సందేహం. ఈ నేపథ్యంలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ.. మునుగోడు విషయంపై తాను ఇచ్చిన హామీని నెరవేర్చాలని కేటీఆర్ కు ఇక్కడి ప్రజలు విన్నవిస్తున్నారు.

# అభివృద్ధికి చేయూత నివ్వండి.....! -జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి, జనవరి 12( నేటి నిజం (ప్రతినిధి) పరిశ్రమలు సి.ఎస్.ఆర్.నిధులు అందజేసి జిల్లా అభివృద్ధికి చేయూత నివ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పరిశ్రమల యామాన్యాలను కోరారు.

మంగళవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాజర్షి షాతో కలిసి జిల్లాలోని క్లస్టర్ 5 లో గల వివిధ పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత సిఎస్ఆర్ నిధుల జిల్లా పర్యవేక్షణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు సిఎస్ఆర్ నిధులను అందించి జిల్లా అభివృద్ధికి చేయూత నివ్వాలన్నారు.

టర్న్ ఓవర్ ప్రాఫిట్ లో రెండు శాతం సిఎస్ఆర్ కింద నిధులను జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేయాలని తెలిపారు. కంపెనీ యాక్ట్, సి ఎస్ ఆర్ గైడ్లైన్స్ విధిగా పాటించాలని కోరారు. సిఎస్ఆర్ లో ఏ పనులు చేపట్టినా, సమాచారాన్ని జిల్లా అడ్మినిస్ట్రేషన్ కు ముందుగా తెలియచేసి, కలెక్టర్ ఆమోదం తీసుకోవాలని సూచించారు.

సిఎస్ఆర్ నిధులు సముచిత మార్గం ద్వారా ఖర్చు చేయాలన్నారు. ఆయా పరిశ్రమల ఆధ్వర్యంలో జరిగిన పనుల వద్ద కంపెనీ పేరుతో బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో సిపి.ఓ. మనోహర్, జిల్లాలోని క్లస్టర్ 5 లో గల హెటిరో గ్రూప్స్, హానర్, హానర్ ల్యాబ్స్,ఏ ఇ టి లెబరేటరీస్, వీర్ కెమిక్స్ అండ్ ఎరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, హారిక డ్రగ్స్ ప్రై. లిమిటెడ్, క్లివిన్ వర్ద్, ఐడిఏ బొల్లారం, నై మడ్ ల్యాబ్స్, మెట్రోచం ఏ పి ఐ ప్రైవేట్ లిమిటెడ్, సాయి లైఫ్ సైన్సెస్, వివిన్ డ్రగ్స్ అండ్ ఫార్మసుటికల్స్, రక్ష్ ఐటి డ్రగ్స్ ప్రైవేట్.లి., ఎస్ఎంఎస్ లైఫ్ సైన్స్ ఇండియా లిమిటెడ్, వర్ద్యూస్ డ్రగ్స్ అండ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, మెస్సర్స్ ఏ పి మెట్ ఇంజనీరింగ్స్ లిమిటెడ్, డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్,విన్నికా ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, మైత్రి లాబరేటరీస్. ప్రైవేట్ లిమిటెడ్,చెన్ టెక్ యాసిడ్స్ అండ్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్, నె వ్ ల్యాండ్ లాబరేటరీస్, నో?చ్ ల్యాబ్స్ లిమిటెడ్, విరుపాక్ష యూనిట్ వన్, గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ తదితర పరిశ్రమల ప్రతినిధులు, సిఎస్ఆర్ నిధుల పర్యవేక్షణ కమిటీలోని ఆయా శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభ భద్రత ఏర్పాట్ల పరిశీలన: ఏవి రంగనాథ్

ఖమ్మం, జనవరి 12: (నేటి నిజం ప్రతినిధి): ఖమ్మం నూతన సమీకృత కార్యాలయాల భవన సముదాయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్రావు ఈనెల 18న విచ్చేయుచున్న నేపథ్యంలో గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ. రంగనాథ్, ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ పోలీస్ అధికారులతో కలసి ట్రాఫిక్ డైవర్షన్, వాహనాల పార్కింగ్, బహిరంగ సభ వేదిక ప్రాంతాలను తిరిగి పరిశీలించారు. ఎన్టీఆర్ సర్కిల్, వరంగల్ క్రాస్ రోడ్డు, కోదాడ క్రాస్ రోడ్డు, ఇల్లందు రోడ్డు, వెంకటగిరి రోడ్డు, కొదుమూరు రోడ్డు, కొణిజర్ల రోడ్లలో తిరిగి పరిశీలించారు. భద్రత ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు డిఐజి ఏవీ. రంగనాథ్ తెలిపారు.

# ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన వాయిదా

హైదరాబాద్ జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ఈ నెల 19న తెలంగాణకు వస్తారని భావించిన ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన వాయిదా పడింది. అనివార్య కారణాలతోనే పర్యటన వాయిదా వేసినట్లు పీఎంవో వర్గాల నుంచి సమాచారం వచ్చింది. అయితే.. దీనికి ప్రధానంగా మోడీ మాతృమూర్తి హీరాబెన్ మరణంతో ఆయా కార్యక్రమాలకు సంబంధించిన క్రతువుల కోసం.. 19న మోడీ గుజరాత్ వెళ్లనున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ పర్యటన వాయిదా పడిందని సమాచారం. ఇదిలావుంటే.. ఈ నెల 19న ప్రధాని మోడీ హైదరాబాద్ కు రావాల్సి ఉంది. ఈ క్రమంలో ఆయన బిజీ షెడ్యూల్ గడపాలని కూడా నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా తెలంగాణ బీజేపీ కార్యకలాపాలపైనా మోడీ దృష్టి పెడతారని తెలిసింది. అవేకాకుండా.. అధికారిక కార్యక్రమాలతోపాటు పలు రాజకీయ కార్యక్రమాలు కూడా మోడీ పర్యటనలో భాగంగా ప్లాన్ చేశారని సమాచారం. ముఖ్యంగా తెలంగాణ పర్యటనలో ప్రధాని మోడీ మూడు కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. 19న సికింద్రాబాద్లో వందే భారత్ రైలును ప్రారంభించడంతోపాటు సికింద్రాబాదు– విజయవాడ మధ్య రైల్వే ఆధునీకరణ పనులకు శంఖుస్థాపన కాజీపేట్లో కోచ్ ఫ్యాక్టరీకి సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టాల్సి ఉంది. ఈ కార్యక్రమాలతోపాటు పరేడ్ గ్రౌండ్లో భారీ బహిరంగసభకు కూడా రాష్ట్ర బీజేపీ నేతలు ప్లాన్ చేశారు. ప్రదాని మోడీ పర్యటన వాయిదా పడడంతో ఈ పనులన్నీ వాయిదా వేసినట్లు సమాచారం.

# మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్‌లో 'మధ్య ప్రదేశ్ గ్లోబల్ ఇన్ వెస్టర్స్ సమిట్ 2023'

న్యూఢిల్లీ, జనవరి 12:మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ లో ఏర్పాటు చేసిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్' ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న ఒక వీడియో సందేశం మాధ్యం ద్వారా ప్రసంగించారు. మధ్య ప్రదేశ్ లో ఉన్న అనేక పెట్టుబడి అవకాశాల ను ఈ శిఖర సమ్మేళనం చాటిచెబుతోంది.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, మొదట ఇన్ వెస్టర్ లకు మరియు నవ పారిశ్రామికవేత్తల కు సాదర స్వాగత వచనాల ను పలికారు. అభివృద్ధి చెందినటువంటి భారతదేశాన్ని నిర్మించడం లో మధ్య ప్రదేశ్ యొక్క పాత్ర ను గురించి ఆయన ప్రముఖం గా ప్రస్తావించారు. ''విశ్వాసం మొదలుకొని ఆధ్యాత్మికవాదం నుండి పర్యటన వరకు; అలాగే వ్యవసాయం మొదలుకొని విద్య మరియు నైపుణ్యాల అభివృద్ధి వరకు తీసుకుంటే మధ్య ప్రదేశ్ ఒక అపురూపమైన గమ్యస్థానం గా ఉంది'' అని ఆయన అన్నారు. భారతదేశం యొక్క 'అమృత కాలం' తాలూకు స్వర్ణ యుగం ఆరంభమైపోయింది మరి అభివృద్ధి చెందినటువంటి ఒక భారతదేశాన్ని నిర్మించడం కోసం మనం అందరం కలిసికట్టు గా శ్రమిస్తున్నాం అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రపంచం లో ప్రతి ఒక్క సంస్థ మరియు నిపుణుడు భారతదేశం పౌరుల పట్ల విశ్వాసాన్ని పెంచుకోవడం పట్ల ప్రధాన మంత్రి ప్రసన్నత ను వెలిబుచ్చుతూ ఎప్పుడైతే మనం అభివృద్ధి చెందిన భారతదేశాన్ని గురించి మాట్లాడుకొంటూ ఉంటామో అప్పుడు అది కేవలం మన ఆకాంక్షే కాదు, ఇది భారతదేశం లో ప్రతి ఒక్క వ్యక్తి యొక్క సంకల్పం గా ఉంది'' అని ప్రధాన మంత్రి అభివర్ణించారు.

ప్రపంచ సంస్థ లు వ్యక్తం చేస్తున్న బరోసా కు సంబంధించిన ఉదాహరణల ను ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ఐఎమ్ఎఫ్ భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థ లో ఒక ఉజ్వలమైన బిందువు గా భావిస్తోంది, అలాగే ప్రపంచ సవాళ్ళ ను పరిష్కరించడం లో అనేక ఇతర దేశాల తో పోలిస్తే భారతదేశం మెరుగైన స్థితి లో ఉంది అని ప్రపంచ బ్యాంకు ఇప్పటికే పేర్కొంది అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశాని కి గల బలమైన స్థూల ఆర్థిక పునాదుల ను గురించి ప్రధాన మంత్రి చెప్తూ, ఈ సంవత్సరం లో జి–20 కూటమి లో భారతదేశం అత్యంత వేగం గా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ల సరసన నిలబడుతుంది అని ఒఇసిడి చెప్పింది అని వెల్లడించారు. మోర్గన్ స్టేన్ లీ ని ప్రధాన మంత్రి ఉట్టంకిస్తూ, భారతదేశం రాబోయే 4– 5 సంవత్సరాల లో ప్రపంచం లోని మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ గా నిలచే దిశ లో సాగుతున్నది అన్నారు. వర్తమాన దశాబ్దం ఒక్కటే కాకుండా యావత్తు శతాబ్ది భారతదేశాని ది అంటూ మెక్ కిన్ సే ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సిఇఒ) ప్రకటించారు అని కూడా ప్రధాన మంత్రి అన్నారు. "సంస్థ లు మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ను పరిశీలిస్తున్న విశ్వసనీయమైన స్వరాల కు భారతదేశం పట్ల ఇది వరకు లేనటువంటి నమ్మకం ఏర్పడింది" అని ప్రధాన మంత్రి చెప్తూ, "గ్లోబల్ ఇన్ వెస్టర్ లు సైతం ఇదే తరహా ఆశాభావాన్ని కలిగివున్నారు" అని ప్రధాన మంత్రి అన్నారు. ఇన్ వెస్టర్ లలో చాలా మంది భారతదేశాన్ని వారి యొక్క పెట్టుబడి గమ్యస్థానం గా ఎంచుకొంటున్నారన్న ఒక ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ బ్యాంకు సర్వేక్షణ లో తేలినట్లు ప్రధాన మంత్రి వెల్లడించారు. "ప్రస్తుతం భారతదేశం అందుకొంటున్న ఎఫ్ డిఐ రికార్డుల ను ఛేదించే స్థాయి లో నమోదు అవుతోంది. మా మధ్య కు మీరు రావడం సైతం ఇదే భావన ను సూచిస్తోంది" అని కూడా ప్రధాన మంత్రి అన్నారు. దేశం పట్ల వ్యక్తం అవుతున్నటువంటి బలమైన ఆశావాదం తాలూకు ఖ్యాతి శక్తివంతమైన ప్రజాస్వామ్యం, యువత సంఖ్య అధికం గా ఉన్న దేశ జనాభా మరియు భారతదేశం లోని రాజకీయ స్థిరత్వం.. వీటిదే అని ఆయన అన్నారు. భారతదేశం నిర్ణయాలు జీవించడం లో సౌలభ్యాన్ని, వ్యాపార నిర్వహణ లో సౌలభ్యాన్ని పెంపొందింప చేస్తున్నాయి అని ఆయన నొక్కి చెప్పారు.

ఆత్మనిర్భర్ భారత్ ఉద్యమాన్ని గురించి ప్రధాన మంత్రి వివరిస్తూ, 2014 వ సంవత్సరం నాటి నుండి భారతదేశం 'రిఫార్మ్, ట్రాన్స్ ఫార్మ్ ఎండ్ పెర్ ఫార్మ్' ('సంస్కరించు, మార్పు చేయు మరియు చాటిచెప్పు) అనే మార్గాన్ని అనుసరిస్తూ పెట్టుబడి కి ఒక ఆకర్షణీయమైన గమ్యస్థానం గా మారింది అని తెలియ జేశారు. "వంద సంవత్సరాల లో ఒకసారి తలెత్తే సంకటం ఎదురైనప్పటికీ కూడాను మేం సంస్కరణ ల మార్గం లో సాగిపోతున్నాం" అని ప్రధాన మంత్రి అన్నారు.

గడచిన ఎనిమిది సంవత్సరాల లో సంస్కరణ ల స్థాయి మరియు వేగం నిరంతరాయం గా వృద్ధి చెందుతూ వచ్చినట్లు ప్రధాన మంత్రి పేర్కొంటూ, "ఒక స్థిరమైన ప్రభుత్వం, ఒక నిర్ణయాత్మక శక్తి కలిగిన ప్రభుత్వం, సరి అయినటువంటి ఉద్దేశ్యాల తో సాగే ప్రభుత్వం అభివృద్ధి ని మునుపు ఎన్నడూ ఎరుగనంత వేగం గా చేసి చూపిస్తుంది'' అని వ్యాఖ్యానించారు. బ్యాంకింగ్ రంగం లో మూలధన పునర్ వ్యవస్థీకరణ మరియు పాలన సంబంధి సంస్కరణల ను గురించి ఉదాహరిస్తూ, ఐబిసి వంటి ఆధునిక పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం, జిఎస్ టి రూపం లో 'వన్ నేశన్, వన్ ట్యాక్స్ ' వంటి ఒక వ్యవస్థ ను నెలకొల్పడం, కార్పొరేట్ టాక్స్ ను ప్రపంచ దేశాల లో స్పర్థాత్మకమైంది గా తీర్చిదిద్దడం, సావ్ రిన్ వెల్త్ ఫండ్స్ ను మరియు పెన్షన్ ఫండ్స్ ను పన్ను పరిధి లో నుండి మినహాయించడం, అనేక రంగాల లో 100 శాతం ఎఫ్ డిఐ ని ఆటోమేటిక్ రూట్ గుండా అనుమతించడం, స్వల్ప ఆర్థిక పొరపాటుల ను అపరాధాల పరిధి నుండి తప్పించడం, ఆ తరహా సంస్కరణ ల ద్వారా పెట్టుబడి మార్గం లో ఎదురయ్యే ఆటంకాల ను తొలగించడం గురించి ప్రస్తావించారు. భారతదేశం తన ప్రైవేటు రంగం యొక్క బలం పైన సమానమైన రీతి లో ఆధారపడుతూ ఉన్న సంగతి ని కూడా ఆయన స్పష్టం చేశారు. ప్రైవేటు రంగం యొక్క ప్రవేశాని కి అనువు గా రక్షణ, గనులు మరియు అంతరిక్షం ల వంటి పలు వ్యూహాత్మక రంగాల తలుపుల ను తెరవడం జరిగిందని ఆయన తెలియ జేశారు. డజన్ ల సంఖ్య లో ఉన్న శ్రమ చట్టాల ను 4 కోడ్ లుగా క్రోడీకరించడమైందని, ఇది ఒక ప్రధానమైన చర్య అని కూడా ఆయన చెప్పారు. నియమాల ను అనుసరించడం లో ఉన్న ఇబ్బందుల ను తగ్గించడం కోసం కేంద్రం స్థాయి లో, రాష్ట్రాల స్థాయి లో ఇదివరకు ఎన్నడూ లేని స్థాయి లో ప్రయాస లు కొనసాగుతూ ఉన్నాయి. దాదాపు గా 40,000 నియమాల పాలన సంబంధి అగత్యాల ను గత కొన్నేళ్ళ లో రద్దు చేయడం జరిగింది అని ప్రధాన మంత్రి వెల్లడించారు.

# కోల్ కాతా లోని జోకా లో గల నేశనల్సెంటర్ ఫార్ డ్రింకింగ్ వాటర్, సేనిటేశన్ ఎండ్ క్వాలిటీ పేరు ను మార్చివేస్తూ ఆసంస్థ కు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ నేశనల్ ఇన్ స్టిట్యూశన్ ఆఫ్ వాటర్ ఎండ్సేనిటేశన్ (ఎస్ పిఎమ్-ఎన్ఐడబ్ల్యుఎఎస్)

న్యూఢిల్లీ, జనవరి 12:కోల్ కాతా లోని జోకా లో గల నేశనల్ సెంటర్ ఫార్ డ్రింకింగ్ వాటర్, సేనిటేశన్ ఎండ్ క్వాలిటీ పేరు ను మార్చివేస్తూ ఆ సంస్థ కు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ నేశనల్ ఇన్ స్టిట్యూశన్ ఆఫ్ వాటర్ ఎండ్ సేనిటేశన్ (ఎస్ పిఎమ్– ఎన్ఐడబ్ల్యుఎఎస్) అనే పేరు ను పెట్టేందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఎక్స్–పోస్ట్ ఫ్యాక్టో ఆమోదాన్ని తెలియజేసింది.

ఈ సంస్థ ను పశ్చిమ బంగాల్ లో కోల్ కాతా లోని జోకా కు చెందిన డాయమండ్ హార్బర్ రోడ్డు లో 8.72 ఎకరాల భూమి మీద స్థాపించడం జరిగింది. శిక్షణ కార్యక్రమాల మాధ్యం ద్వారా పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్, త్రాగునీరు, పారిశుధ్యం, ఇంకా ఆరోగ్య రక్షణల రంగం లో రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల లో సామర్థ్యాన్ని వికసింపచేసేటటువంటి ఒక ప్రముఖ సంస్థ గా దీనిని ఏర్పాటు చేయడమైంది. ఆ తరహా సామర్థ్యాల ను కేవలం స్వచ్ఛ భారత్ మిశన్ మరియు జల్ జీవన్ మిశన్ ల అమలులో నిమగ్నం అయిన ఫ్రంట్ లైన్ వర్క్ ఫోర్స్ కే కాకుండా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల కు చెందిన స్థానిక సంస్థ ల ప్రతినిధుల కోసం కూడాను దృష్టి లో పెట్టుకొని రూపొందించడం జరిగింది. దీనికి అనుగుణం గా శిక్షణ సంబంధి మౌలిక సదుపాయాలు, పరిశోధన మరియు అభి వృద్ధి (ఆర్ ఎండ్ డి) బ్లాకు మరియు ఒక నివాస భవన సముదాయం సహా తగిన మౌలిక సదుపాయాల స్వరూపాన్ని ఏర్పాటు చేయడమైంది. ఈ సంస్థ లో శిక్షణ ను అందించడాని కి గాను వాటర్ సేనిటేశన్ ఎండ్ హైజీన్ (డబ్ల్యుఎఎస్ హెచ్) సంబంధి సాంకేతికతల కు చెందిన కార్యాచరణ ప్రధానమైనటువంటి, ఇంకా సూక్ష్మ నమూనాల ను కూడా నెలకొల్పడమైంది.

పశ్చిమ బంగాల్ కు చెందిన అత్యంత యోగ్య పుత్రుల లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఒకరు. జాతీయ సమైక్యత వాదాన్ని బలపరచడం లో ఆయన అగ్రేసరుడు. పారిశ్రామికీకరణ కు ప్రేరణ గా ఆయన నిలచారు. ఆయన ఒక ప్రతిష్ఠిత విద్వాన్ మాత్రమే కాక విద్యారంగ ప్రముఖుడు కూడాను. యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా కు అతి చిన్న వయస్సులోనే కులపతి గా కూడా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవల ను అందించారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ పేరు ను ఈ సంస్థ కు పెట్టడం యావత్తు స్టేక్ హోల్డర్స్ కు ఆయన యొక్క నిజాయతీ, అఖండత ల తాలూకు విలువల ను ఇముడ్చుకొనేందుకు ప్రేరణ ను అందిస్తుండడం తో పాటే సంస్థ యొక్క శ్రమ సంస్కృతి లో నిబద్ధత ను సూచిస్తూ ఆయన కు నిజమైన గౌరవాన్ని ప్రదానం చేసేటటువంటిది అవుతుంది. ఈ సంస్థ ను ప్రధాన మంత్రి 2022 వ సంవత్సరం డిసెంబర్ లో ప్రారంభించారు.

## సమిష్టి కృషితో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం ...!- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.



సంగారెడ్డి,జనవరి 12(నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో ఈ నెల 18 నుండి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరి సమిష్టి కృషితో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో కోరారు.

కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లాలో 17,11,685 మందికి స్క్రీనింగ్ చేయడానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లాలోని 647 గ్రామపంచాయతీలు, 8 మున్సిపాలిటీలలోని 199 వార్డులు, జిహెచ్ఎంసి పరిధిలోని మూడు వార్డులలో మొత్తం 854 క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

కంటి వెలుగు క్యాంపులు ఉదయం 9 గంటల నుండి 4 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

కంటి వెలుగు కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, ఆర్పీలు, మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించాలనిసూచించారు.

కంటి వెలుగు పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.

జిల్లాలో కంటి వెలుగు ప్రోగ్రాం షెడ్యూల్ మేరకు ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నియోజక, మండల ప్రత్యేక అధికారులకు సూచించారు.

పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మున్సిపల్ కమిషనర్లు కంటి వెలుగు క్యాంపుల విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కంటి వెలుగు క్యాంపు లొకేషన్స్ , తేదీ, సమయం గురించిన వివరాలను ముందస్తు ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సీలను ప్రదర్శించాలని, టామ్ టామ్/మైక్ అనౌన్స్ మెంట్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించి కంటి వెలుగు క్యాంపులను వినియోగించుకునేలా చూడాలని కోరారు.

జిల్లాలో క్యాంపుల నిర్వహణకు సంబంధించి గ్రామ, మండల, డివిజన్, మున్సిపల్ స్థాయి సూక్ష్మ ప్రణాళికను ఆయా అధికారులు,ప్రజా ప్రతినిధులకు అందజేయడం జరిగిందని, ఆయా తేదీలలో ఆయా వార్డులలో, గ్రామాలలో క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి వెలుగు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## రెండు రోజుల పాటు మేఘాలయలో పర్యటించనున్న కేంద్ర మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ, జనవరి 12:నైపుణ్యాభివృద్ధి ఙ నవపారిశ్రామికత్వం శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ రెండు రోజుల అధికారిక పర్యటన కోసం రేపు మేఘాలయ వెళ్లనున్నారు.

మంత్రి మొదట గౌహతికి చేరుకుని, అక్కడి నుంచి షిల్లాంగ్‌కు వెళ్తారు.

రామకృష్ణ మిషన్ నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని తొలుత మంత్రి సందర్శిస్తారు. ఆ తర్వాత స్థానిక వ్యాపార సంఘాల సభ్యులతో సమావేశం జరుగుతుంది. వ్యాపార అవకాశాలు, సవాళ్ల గురించి చర్చిస్తారు.

ఆ తర్వాత, పార్టీ రాష్ట్రాధ్యక్షుడు, ఆఫీస్ బేరర్లు, పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలతో మంత్రి సమావేశమవుతారు.

ఆ కార్యక్రమం అనంతరం, సామాజిక కార్యకర్తలతో సమావేశమై స్థానిక సమస్యలు, సమస్యలపై మంత్రి చర్చిస్తారు.

శుక్రవారం, మవ్లేమ్‌లో మహిళలను ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తారు. ఆ తర్వాత 'చర్చ్ ఆఫ్ నార్త్ ఇండియా'ను సందర్శిస్తారు.

మేఘాలయ నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శితోనూ శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ సమావేశమవుతారు, రాష్ట్రంలో చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చిస్తారు.

ఆ రోజు చివరిలో, స్థానిక మీడియాతో ముఖాముఖి కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొంటారు.

శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ ఈశాన్య ప్రాంతంలో చేపడుతున్న నాలుగో పర్యటన ఇది. అంతకుముందు, నాగాలాండ్ (రెండు సార్లు), త్రిపురలోనూ పర్యటించారు. సాఫ్ట్‌వేర్ సాంకేతికత పార్క్ అయిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఙ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వర్ధమాన వెదురు కళాకారుల కోసం ఒక పైలట్ ప్రాజెక్ట్ వంటి పదికి పైగా కార్యక్రమాలను ఆయన ప్రారంభించాడు.

## 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.122.47 కోట్ల డివిడెండ్ అందజేసిన హెచ్ఎల్ఎల్

న్యూఢిల్లీ, జనవరి 12:కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని మినీ రత్న ప్రభుత్వ రంగ సంస్థ అయిన హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ (హెచ్ఎల్ఎల్) 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను ఆరోగ్య మంత్రిత్వ శాఖకు రూ.122.47 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. ఈరోజు ఇక్కడ నిర్మాణ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి (ఆరోగ్య, కుటుంబ సంక్షేమం) డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ సమక్షంలో హెచ్ఎల్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బెజి జార్జ్ కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవ్యకు చెక్కును అందించారు.

2021?22 ఆర్థిక సంవత్సరంలో హెచ్ఎల్ఎల్‌కు రూ.35,668 కోట్ల రికార్డు టర్నోవర్, పన్నుకు ముందు రూ.551.81 కోట్ల లాభం రావడం పట్ల సంతోషం వ్యక్తంచేసారు

డాక్టర్ మన్సుఖ్ మాండవ్య. మహమ్మారి సమయంలో వారి మద్దతును అభినందిస్తూ, "హెచ్ఎల్ఎల్ ముఖ్యమైన పాత్ర పోషించింది. కోవిడ్-19 మహమ్మారి నిర్వహణ కోసం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు మద్దతుగా అత్యవసర వైద్య సామాగ్రి సేకరణ, పంపిణీ, మహమ్మారి నిర్వహణ కోసం అత్యవసర వైద్య వస్తువుల సేకరణ మరియు సరఫరా కోసం నోడల్ ఏజెన్సీగా, ఇది సంక్షోభం లోనూ రియల్ టైం సేవా, నిర్వహణను అందించగలిగింది" అని కేంద్ర మంత్రి అన్నారు.

పిఎస్‌యులు గొప్ప విజన్‌తో స్థాపించినప్పటికీ, వాటి పనితీరు ఎల్లప్పుడూ సంతృప్తికరంగా లేదని ఆయన పేర్కొన్నారు.

పిఎస్‌యుల సుస్థిరతపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, "ఆర్థిక క్రమశిక్షణ మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తన పిఎస్‌యుల స్థిరత్వానికి కీలకమైన అంశాలు" అని స్పష్టం చేశారు.

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్, హెచ్ఎల్ఎల్ సాధించిన విజయానికి అభినందనలు తెలిపారు.

మహమ్మారి సమయంలో సంస్థ కృషిని ప్రశంసించారు. హెచ్ఎల్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బెజి జార్జ్, హెచ్ఎల్ఎల్ పట్ల విశ్వాసం నింపినందుకు, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలు, ముఖ్యంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ద్వారా అందించిన సహకారానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ కుటుంబ నియంత్రణ కార్యక్రమానికి మద్దతుగా గర్భనిరోధక సాధనాలను ఉత్పత్తి చేయడానికి హెచ్ఎల్ఎల్ 1966 మార్చి 1 న స్థాపించారు. పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెడుతూనే హెచ్ఎల్ఎల్ ఇతర ఆరోగ్య సంరక్షణ విభాగాలైన హాస్పిటల్ ఉత్పత్తులు, హాస్పిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, మెడికల్ ఎక్విప్‌మెంట్ ప్రొక్యూర్‌మెంట్ కన్సల్టెన్సీ, డయాగ్నస్టిక్ సర్వీసెస్, ఫార్మాస్యూటికల్స్ రిటైలింగ్ మొదలైన వాటిలో విస్తరించింది.

ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, మంత్రిత్వ శాఖ, హెచ్ఎల్ఎల్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# బార్మర్ రైతులకు పంటల బీమా పథకం కింద పూర్తి చెల్లింపులు

### -540 కోట్ల పంట బీమా క్లెయిమ్‌లను త్వరలో చెల్లింపు

### -కేంద్ర వ్యవసాయ మంత్రి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 12:ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కు సంబంధించి ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. 2021 ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను బార్మర్ రైతులకు పూర్తిగా చెల్లించాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో గత వారం రూ. 311 కోట్ల పాక్షిక క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ తెలిపింది. ఈరోజు జరిగిన సమీక్షా సమావేశం అనంతరం బీమా కంపెనీ రైతులకు అదనంగా 229 కోట్ల రూపాయల క్లెయిమ్ మొత్తాన్నిచెల్లించడానికి అంగీకరించింది. బార్మర్‌లోని అర్హులైన రైతులకు మొత్తం చెల్లించాల్సి ఉన్న .540 కోట్ల రూపాయలను సాధ్యమైనంత త్వరగా చెల్లించాలని నిర్ణయించారు. కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ కైలాష్ చౌదరి, ఆర్థిక, వ్యవసాయ మంత్రిత్వ శాఖల సీనియర్ అధికారులు, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ మరియు రాజస్థాన్ వ్యవసాయ కమిషనర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ మాట్లాడుతూ పంట నష్టపోయిన కోట్లాది మంది రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా ఆర్థిక భద్రత కల్పించామన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. తీసుకునేటప్పుడు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు పంటల బీమా తీసుకునేలా చూడడానికి కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సులభతరం చేసేందుకు ప్రయత్నిస్తోంది. పంటల బీమా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వాలు, భీమా కంపెనీలతో చర్చించి చిన్నచిన్న క్లెయిమ్‌ల విషయంలో రైతులకు ప్రయోజనం కలిగేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకుంటుందని మంత్రి వివరించారు. సమావేశంలో పంటల బీమా పథకం సౌలభ్యం మరియు చిన్న క్లెయిమ్‌లకు ప్రతిపాదిత పరిష్కారాలపై సమగ్ర చర్చ జరిగింది.

# స్టార్టప్ ఇండియా నూతన ఆవిష్కరణల వారోత్సవాల 2వ రోజు వర్ధమాన పారిశ్రామికవేత్తల నుండి భాగస్వామ్యం

న్యూఢిల్లీ, జనవరి 12:దేశం నలుమూలలకు చెందిన పారిశ్రామిక ఆవరణ లబ్దిదారులను మరియు కార్య నిర్వాహులను చేరుకోవాలనే లక్ష్యంతో, స్టార్టప్ ఇండియా నూతన ఆవిష్కరణల వారోత్సవాల 2వ రోజున అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

స్టార్టప్ ఇండియా, కేరళ స్టార్టప్ మిషన్ (ఖుజఓ) భాగస్వామ్యంతో 2023 జనవరి 10 మరియు 11 తేదీల్లో కొచ్చిలో మహిళల స్టార్టప్ల కోసం రెండు రోజుల ప్రత్యక్ష వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈరెండు రోజుల వర్క్‌షాప్ ఇప్పటికే ఉన్న మరియు ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను లక్ష్యంగా చేసుకుంది . 75 మంది కి పైగా వర్ధమాన వ్యవస్థాపకులు మరియు మహిళా వ్యవస్థాపకుల నుండి అద్భుతమైన భాగస్వామ్యం తో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ యొక్క తొలి రోజున వ్యవస్థాపకులచే ప్రస్థాన-భాగస్వామ్య సెషన్‌లు పరిశ్రమ నిపుణులచే 'ఉత్పత్తి ధ్రువీకరణ, మార్కెట్ ప్రవేశం మరియు నిర్మాణం' మరియు ' అభ్యర్థన , బేరసారాలు మరియు నిధుల సేకరణ'పై సామర్థ్య నిర్మాణ శిక్షణ జరిగాయి . దీని తర్వాత వర్క్‌షాప్ 2వ రోజున ఎంపిక చేయబడిన మహిళా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడిదారుల సంపర్కం, అభ్యర్థన సెషన్‌లు మరియు ఇష్టాగోష్టి కలయిక అవకాశాలు ఉన్నాయి.

ఈశాన్య ప్రాంతం లో మహిళా పారిశ్రామికవేత్తలను పెంపొందించాలనే ఉద్దేశ్యంతో, స్టార్టప్ ఇండియా ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల నుండి ఇప్పటికే ఉన్న మహిళా పారిశ్రామికవేత్తలందరికీ వర్చువల్ మాక్ పిచింగ్ సెషన్‌ను నిర్వహించింది. ఈ ఈవెంట్ ఇన్వెస్టర్లతో నేరుగా చర్చించడానికి మరియు వారినుంచే నేరుగా అభిప్రాయలు స్వీకరించడానికి పాల్గొనేవారికి అవకాశం ఇచ్చింది. 80 కంటే ఎక్కువమంది మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌ల నుండి దరఖాస్తులు స్వీకరించబడ్డాయి, వాటిలో 15 ఎంపిక చేసిన స్టార్టప్‌లు 10 మంది పెట్టుబడిదారులను నిధుల కోసం అభ్యర్థించడానికి అవకాశం పొందాయి.

స్టార్టప్ ఇండియా "బ్రిడ్జింగ్ ది బ్రిడ్జ్: గోయింగ్ గ్లోబల్" అనే అంశంపై వెబ్‌నార్‌ను నిర్వహించింది. రిపబ్లిక్ ఆఫ్ క్రొయేషియాలో భారత రాయబారి శ్రీ రాజ్ కుమార్ శ్రీవాస్తవ, స్టార్టప్‌ల కోసం మైక్రోసాఫ్ట్ కంట్రీ హెడ్ - శ్రీమతి మధురిమా అగర్వాల్ మరియు ఫిన్‌లాండ్‌లోని భారత రాయబారి శ్రీ రవీష్ కుమార్‌తో సహా ముగ్గురు నిపుణులు ఈ సెషన్‌కు నాయకత్వం వహించారు.

తెలంగాణలో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా "ఇన్నోవేషన్ టు యాక్సిలరేషన్" అనే అంశంపై స్టార్టప్ కార్నివాల్‌ను నిర్వహించింది. కార్యక్రమంలో ఫైర్ సైడ్ చాట్; స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్, ఎగ్జిబిషన్ సదస్సు; విజయ గాథల ప్రదర్శన; ప్రత్యేక స్టార్టప్ అవార్డు; మరియు స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ (ౡమోఈఖా)పై అవగాహన వర్క్‌షాప్ జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్నవారు స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, సంభావ్య పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, సంస్థలు మొదలైనవారు పాల్గొన్నారు.

కాంచీపురంలోని గోల్డెన్ జూబ్లీ బయోటెక్ పార్క్ ఫర్ ఉమెన్ సొసైటీలో ఇద్దరు మహిళా వ్యవస్థాపకులు నేతృత్వంలో ' విద్యావేత్త పారిశ్రామికవేత్తగా మారడం' మరియు ' క్లీన్ టెక్ పారిశ్రామికవేత్త ప్రస్థానం' అనే రెండు అంశాలపై వెబ్‌నార్‌ను నిర్వహించారు. వెబ్‌నార్ ఆకర్షణీయమైన మరియు ఇంటరాక్టివ్ సెషన్ జరిగాయి. 100 మంది యువ ఆవిష్కర్తలు మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోయంబత్తూరులోని ఏ ఐ ఎస్ రైజ్ బిజినెస్ ఇంక్యుబేటర్ ప్రైవేట్ లిమిటెడ్ మూడు రోజుల ఈవెంట్, 'స్టార్టప్ ఒడిస్సీ'ని నిర్వహించింది, దీని మొదటి దశ జనవరి 11న ప్రారంభమైంది. తమిళనాడు, పూణె మరియు ఒడిశాలోని 10 కళాశాలల నుండి విద్యార్థులు ఈ కార్యక్రమంలో చేరారు మరియు ఆన్‌లైన్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 1000 మంది విద్యార్థులు మరియు యువ ఆవిష్కర్తలు చురుకుగా పాల్గొన్నారు.

# సోమేష్ కుమార్ స్వచ్ఛందంగా పదవీ విరమణ?

### -జగన్‌తో గంటకు పైగానే సోమేష్ కుమార్ భేటీ.. ఫైనల్ డెసిషన్ ఇదేనా..?



అమరావతి జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో రిలీవ్ అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ ఏపీ సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. దాదాపు గంట పాటు ఈ భేటీ సాగింది.

మీడియాతో మాట్లాడేందుకు సోమేష్ విముఖత వ్యక్తం చేశారు. తాజా పరిణామాలపై జగన్ సోమేష్‌ను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి రిపోర్ట్ చేసిన అనంతరం సోమేష్ సీఎం జగన్ దగ్గరకు వెళ్లారు. సోమేష్‌కుమార్ జీఏడీలో రిపోర్ట్ చేసి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసేందుకు రాజీనామా లేఖను ఇవ్వాలని సోమేష్‌కుమార్ డిసైడ్ అయినట్లు సమాచారం. రాజీనామా అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా సోమేష్‌కుమార్‌ను నియమిస్తారని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం సీఎస్ స్థాయి పోస్టులేమీ ఖాళీగా లేవు. ప్రస్తుత ఏపీ సీఎస్ జవహర్ కూడా 2024 జూన్ వరకూ ఈ పోస్టులో కొనసాగేందుకు ఛాన్స్ ఉంది. సీఎంవోలో ఇతర ప్రధాన పోస్టులు కూడా గతేడాది నవంబర్‌లోనే.. అంటే ఇటీవలే భర్తీ కావడంతో సోమేష్ కుమార్‌కు సీఎస్ స్థాయి పోస్టు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేష్ అంతకంటే తక్కువ స్థాయి పోస్టుల్లో విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా లేరు. దీంతో.. రాజీనామా చేసి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించడమే మేలనే అభిప్రాయంలో సోమేష్ కుమార్ ఉన్నట్లు తెలిసింది. సోమేశ్ తెలంగాణ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగారని చెప్పొచ్చు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత అత్యధిక కాలం పని చేసిన సీఎస్‌గా నిలిచిపోయారు. రాష్ట్రం ఆవిర్భవించిన మొదట్లో సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ శర్మ రెండున్నరేళ్ల పాటు పని చేశారు. తర్వాత ప్రదీప్ చంద్ర నెల రోజులు, ఎస్పీ సింగ్ 13 నెలల పాటు సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం సీఎస్‌గా నియమితులైన ఎస్‌కే జోషి 23 నెలల పాటు పని చేశారు. తెలంగాణ ఐదో సీఎస్‌గా 2019 డిసెంబర్ 31న పదవీ బాధ్యతలు చేపట్టిన సోమేశ్ కుమార్ గత డిసెంబర్ 30 నాటికి మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. మంగళవారం నాటికి ఆయన పదవీ కాలం మూడేళ్ల 11 రోజులు అయ్యింది. ఎక్కువ కాలం పని చేసిన సీఎస్‌గా ఆయన ఉండిపోయారు. ఆయన ఈ సంవత్సరం డిసెంబర్ 30న పదవీ విరమణ చేయనున్నారు. అంటే ఇంకా ఏడాది పాటే ఆయనకు సర్వీసు మిగిలి ఉంది. ఇంతలో ఏపీకి వెళ్లాల్సి వచ్చింది.

# 1 జనవరి 2023 నుండి ప్రారంభించబడిన కొత్త సమగ్ర ఆహార భద్రతా పథకానికి కేంద్ర ప్రభుత్వం కొత్త పేరు "ప్రధాన్ మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన

న్యూఢిల్లీ, జనవరి 12:గౌరవనీయ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ భేటీలో అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) మరియు ప్రాథమిక గృహ (పిహెచ్‌హెచ్) లబ్ధిదారులకు ఉచిత ఆహార ధాన్యాలను అందించడానికి కొత్త సమగ్ర ఆహార భద్రతా పథకానికి ఆమోదం తెలిపింది

. ఇది జనవరి 1, 2023 నుండి ప్రారంభించబడింది. కొత్త పథకం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై)గా పేరు పెట్టారు. కొత్త పథకం అమలు 1 జనవరి 2023 నుండి ప్రారంభమైంది. దీని ద్వారా 80 కోట్ల కంటే ఎక్కువ మంది పేదలు మరియు నిరుపేదలు లబ్ధి పొందుతున్నారు.

లబ్ధిదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మరియు అన్ని రాష్ట్రాల్లో ఏకరూపతను కొనసాగించడానికి ఎన్ఎఫ్ఎస్ఏ కింద అర్హత ప్రకారం పిహెచ్‌హెచ్ మరియు ఏఏవై లబ్ధిదారులందరికీ 2023 సంవత్సరానికి పిఎంజికెఎవై కింద ఉచిత ఆహారధాన్యాలు అందించబడతాయి. ఈ సమీకృత పథకం పేదలకు అందుబాటులో స్థోమత మరియు ఆహారధాన్యాల లభ్యత పరంగా బలోపేతం చేస్తుంది.

ఎన్ఎఫ్ఎస్ఏ 2013 యొక్క ప్రభావవంతమైన మరియు ఏకరీతి అమలు కోసం పిఎంజికెఎవై ఆహారం ఙ ప్రజాపంపిణీ శాఖకు చెందిన రెండు రాయితీ పథకాలను ఉపసంహరించుకుంటుంది (ఏ) ఎఫ్‌సీఐకి ఆహార సబ్సిడీ (బి) వికేంద్రీకృత సేకరణ రాష్ట్రాలకు ఆహార రాయితీ, ఉచిత ఆహార ధాన్యాల సేకరణ, కేటాయింపు మరియు పంపిణీకి సంబంధించినది.

క్షేత్రస్థాయిలో పిఎంజికెఎవై సజావుగా అమలు చేయడానికి అవసరమైన చర్యలు ఇప్పటికే తీసుకోబడ్డాయి అనగా ఏఏవై మరియు పిహెచ్‌హెచ్ లబ్ధిదారులకు ఆహార ధాన్యాల ధరను సున్నా చేయడానికి అవసరమైన నోటిఫికేషన్ జారీ చేయబడింది. అలాగే చౌక ధరల దుకాణాల్లో (ఎఫ్‌పిఎస్) సాంకేతిక సమస్యల పరిష్కారం, రేషన్ డీలర్లక మార్జిన్‌కు సంబంధించిన సూచన, లబ్ధిదారులకు ఇచ్చిన ప్రింట్ రసీదులలో సున్నా ధరలు వంటివి ఈ చర్యల్లో ఉన్నాయి.

ఫుడ్ ఙ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ మరియు ఎఫ్‌సిఐ అధికారులు ఈ కొత్త పథకాన్ని సజావుగా అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో క్రమం తప్పకుండా సంభాషిస్తున్నారు.

పేదల ఆర్థిక భారాన్ని తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం 2023లో ఎన్ఎఫ్ఎస్ఏ మరియు ఇతర సంక్షేమ పథకాల కింద ఆహార సబ్సిడీగా రూ. 2 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయనుంది.

## రాంచీలో సిసిఎల్ పనితీరును సమీక్షించి, నూతన సౌకర్యాలను ప్రారంభించిన బొగ్గు శాఖ కార్యదర్శి శ్రీ అమృత్ లాల్ మీనా

న్యూఢిల్లీ, జనవరి 12: బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అమృత్ లాల్ మీనా, అదనపు కార్యదర్శి శ్రీ ఎం నాగరాజు, కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) చైర్మన్ శ్రీ ప్రమోద్ అగర్వాల్ రాంచీలోని ప్రాజెక్ట్ భవన్‌ను బుధవారం సందర్శించి ఝార్ఖండ్ ప్రధాన కార్యదర్శి శ్రీ సుఖదేవ్ సింగ్ సింగ్‌తో ముచ్చటించారు. రాష్ట్రంలోని బొగ్గు మైనింగ్ కంపెనీలకు సంబంధించిన వివిధ సమస్యలను, అంశాలను వారు చర్చించారు. బిసిసిఎల్ సిఎండి, ఇసిఎల్ సిఎంపిడిఐ, సీనియర్ అధికారులతో కలిసి సిసిఎల్ సిఎండి శ్రీ పి.ఎం. ప్రసాద్ కీలక సమావేశానికి హాజరయ్యారు.

ఉదయం బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఝార్ఖండ్ స్పోర్ట్స్ అకాడమీని సందర్శించి, అక్కడి క్రీడాకారులతో సంభాషించారు. ఝూరఖండ్ స్పోర్ట్స్ అకాడమీ అన్నది సిసిఎల్ చేపట్టిన సిఎస్ఆర్ వెంచర్. ఇది ఝార్ఖండ్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తుంది. అకాడెమీలోని క్రీడాకారులు అంతర్జాతీయ, జాతీయ స్థాయి పోటీలలో పతకాలను గెలుచుకున్నారు. అక్కడి మౌలిక సదుపాయాలను సమీక్షించి, వారి సామర్థ్యాలను ఉత్తమంగా ప్రదర్శించేందుకు క్రీడాకారులకు శ్రీ మీనా ప్రేరణను ఇచ్చారు.

పునరుద్ధరించిన ఆడిటోరియంను, సిసిఎల్‌లోని గాంధీ నగర్ ఆసుపత్రిలో ఆన్‌లైన్ ఆసుపత్రి నిర్వహణ వ్యవస్థను బొగ్గు శాఖ కార్యదర్శి ప్రారంభించారు. పారదర్శకతను పెంచేందుకు యాంత్రికీకరణ దిశగా సిసిఎల్ చేస్తున్న కృషి ఆన్‌లైన్ ఆసుపత్రి నిర్వహణ వ్యవస్థ. సిసిఎల్ తొలి ఇ-వాహనాన్ని కూడా ఆయన ప్రారంభించారు. పర్యావరణ అనుకూల చొరవలను పెంచడంలో భాగంగా సిసిఎల్ 16 ఇ-వాహనాలను కిరాయికి తీసుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భాగస్వాములందరికీ ఉత్తమమైన వైద్య సదుపాయాలను అందించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం చేయాలని శ్రీ మీనా అన్నారు.

కోవిడ్ మహమ్మారి కాలంలో సిఐఎల్ ఆసుపత్రులు అసాధారణ పాత్రను పోషించాయనిపేర్కొంటూ, భవిష్యత్తులో కూడా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది అదే అంకిత భావంతో పని చేస్తారనే విశ్వాసాన్ని సిఐఎల్ చైర్మన్ శ్రీ ప్రమోద్ అగర్వాల్ వ్యక్తం చేశారు.

## యువ శాస్త్రవేత్తలను సాధికారత తో శక్తివంతం చేసే విధానానికి సిఫార్సుల కోసం అంతర్జాతీయ వెబ్‌నార్

న్యూఢిల్లీ, జనవరి 12:భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ (ఖుం) కార్యాలయం, ఇండియన్ నేషనల్ యంగ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఎఔజయా) మరియు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా "యువ శాస్త్రవేత్తలను సాధికారత కల్పించే విధానంపై సిఫార్సులు " అనే అంతర్జాతీయ వెబ్‌నార్‌ను బనారస్ హిందూ యూనివర్సిటీ లో నిర్వహించింది.

భారతదేశంలో పరిశోధన మరియు అభివృద్ధిని మరింతగా పెంపొందించడానికి శాస్త్రీయ మరియు సాంకేతిక నాయకత్వం అత్యుత్తమంగా రూపొందించడానికి తరువాతి తరం యువ శాస్త్రవేత్తలు మరియు పరిశోధకులను (45 సంవత్సరాల వయస్సు లేదా అంతకంటే తక్కువ ) ప్రోత్సహించడానికి మరియు సాధికారత కల్పించేందుకు కొత్త విధాన పత్రం పై సిఫార్సులను క్రోడీకరించే లక్ష్యంతో యువ శాస్త్రవేత్తలను శక్తివంతం చేయడంపై ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ ఆఫీస్ చొరవలో భాగం గా జనవరి 9, 2023న వెబ్‌నార్ నిర్వహించారు.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రొఫెసర్ టీ కే. ఊమెన్, మిచిగాన్, టెక్నలాజికల్ యూనివర్సిటీ, అమెరికా; డాక్టర్ మను వోరా, ఏ ఎస్ క్యూ ఫెలో, చైర్మన్ మరియు ప్రెసిడెంట్, బిజినెస్ ఎక్సలెన్స్, ఇంక్., అమెరికా; ప్రొఫెసర్ అనుప్మా ప్రకాష్, ప్రొవోస్ట్ మరియు ఎగ్జిక్యూటివ్ వైస్ ఛాన్సలర్, అలాస్కా విశ్వవిద్యాలయం; ప్రొఫెసర్ గణేష్ బోరా, అసోసియేట్ వైస్ ఛాన్సలర్ (రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్), ఫాయెట్‌విల్లే స్టేట్ యూనివర్సిటీ; ప్రొఫెసర్ మనోజ్ కె. శుక్లా, సాయిల్ ఫిజిక్స్ ప్రొఫెసర్, న్యూ మెక్సికో స్టేట్ యూనివర్సిటీ, అమెరికా; డాక్టర్ కేశవ్ స్వర్ంకర్, కన్సల్టెంట్ జనరల్ సర్జన్, రాయల్ గ్వెంట్ హాస్పిటల్, న్యూపోర్ట్, యూ కే; ప్రొఫెసర్ నితిన్ కే. త్రిపాఠి, ప్రొఫెసర్ (రిమోట్ సెన్సింగ్ మరియు జీ ఐ ఎస్), ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బ్యాంకాక్; ప్రొఫెసర్ సంజయ్ కె. శుక్లా, ఎడిత్ కోవాన్ యూనివర్సిటీ, పెర్త్, ఆస్ట్రేలియా; ప్రొఫెసర్ బిపాశ్యే ఘోష్, రీసెర్చ్ ఫెలో, డీప్ ట్రాన్సిషన్, యూనివర్సిటీ ఆఫ్ సస్సెక్స్, యూ కే; ప్రొఫెసర్ విక్రమ్ అల్వా, ప్రాజెక్ట్ లీడర్, మ్యాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంటల్ బయాలజీ, జర్మనీ వెబ్‌నార్‌లో వక్తలు గా పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు.

కెరీర్ ప్రారంభ పరిశోధకులకు నిధుల మద్దతు కోసం ; వారి ఆసక్తి ఉన్న ప్రాంతంలో పరిశోధన చేపట్టే స్వేచ్ఛ; నైపుణ్యం అభివృద్ధి ; నిర్ణయం తీసుకోవడంలో పాత్ర; అంతర్జాతీయ సహకారాన్ని చేపట్టడానికి పరిపాలనా విధానాలను సడలించడం; కెరీర్ ప్రారంభ శాస్త్రవేత్తలకు బహుమతులు మరియు గుర్తింపు మరియు యువ పరిశోధకులను నిలుపుకోవడానికి మరియు ప్రోత్సహించడానికి కెరీర్ వృద్ధికి అవకాశాల గురించి అవగాహన కల్పించడం; యువ శాస్త్రవేత్తల నెట్‌వర్కింగ్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా సహకారం మరియు నిధుల కోసం అవకాశాలపై అవగాహన కల్పించడం; సలహాదారులకు మంచి మార్గదర్శకత్వ కార్యక్రమాలు మరియు ప్రోత్సాహకాలు; పరిశోధనా నీతిపై విద్య, పరిశోధనా పత్ర ప్రచురణలు మరియు పేటెంట్ దాఖలుకు మద్దతు ఇవ్వడం మొదలైన ముఖ్యమైన సిఫార్సులు వెబ్‌నార్ నుండి వచ్చాయి.

భారతదేశంలోని శాస్త్రవేత్తలు మరియు పరిశోధకులతో సంప్రదింపులు మరియు భారతదేశం అంతటా శాస్త్రవేత్తలు మరియు పరిశోధకులకు (? 45 సంవత్సరాల వయస్సు) వారి అభిప్రాయాన్ని పొందడానికి ప్రశ్నావళి ద్వారా చేసిన సంప్రదింపులు జనవరి 9, 2023న జరిగిన అంతర్జాతీయ వెబ్‌నార్ సిఫార్సులు దేశవ్యాప్తంగా ఉన్న యువకులు మరియు సీనియర్ శాస్త్రవేత్తలతో ఐ ఐ టీ బీ హెచ్ యూ లో జరగబోయే మేధోమథన సదస్సు లో వెలువడే తుది విధాన పత్రంలో చేర్చబడతాయి.

ఈ సందర్భంగా భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ అజయ్ కె సూద్ మాట్లాడుతూ, భారతదేశ భవిష్యత్తుకు పెట్టుబడిగా నిలిచే యువ శాస్త్రవేత్తలను సాధికారత తో శక్తివంతం చేసేందుకు మా నిరంతర ప్రయత్నం ఉంటుంది అని అన్నారు.

## జాతీయ రహదారులపై ప్రమాదహేతువులైన బ్లాక్ స్పాట్స్ ని సరిచేయడానికి గట్టి చర్యలు చేపట్టిన ఎన్ హెచ్ ఏ ఐ

న్యూఢిల్లీ, జనవరి 12:2023 జనవరి 11 నుండి 17వ తేదీ వరకు 'రోడ్ సేఫ్టీ వీక్'ని పాటిస్తూ, జాతీయ రహదారులపై ప్రమాదాలకు గురయ్యే స్ట్రెచ్‌లు, బ్లాక్‌స్పాట్‌లను గుర్తించేందుకు ఎన్ హెచ్ ఏ ఐ ద్వారా గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకు రహదారి భద్రతా ఉపశమన చర్యల కోసం ఎన్ హెచ్ ఏ ఐ తన ఫీల్డ్ ఆఫీసర్లకు మెరుగైన అధికారాలను అందించింది. భద్రతా పనుల పర్యవేక్షణ కోసం ప్రతి ప్రాంతీయ కార్యాలయంలో రహదారి భద్రతా అధికారిని కూడా అధికార యంత్రాంగం నియమించింది.

2015-2018 మధ్య, ఎన్ హెచ్ ఏ ఐ కింద జాతీయ రహదారులపై దాదాపు 4,002 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. ఈ బ్లాక్‌స్పాట్‌లన్నింటికీ స్వల్పకాలిక భద్రతా ఉపశమన చర్యలు అమలు చేశారు. 2,704 బ్లాక్‌స్పాట్‌లపై దీర్ఘకాలిక భద్రతా ఉపశమన చర్యలలో భాగంగా పని పూర్తయింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలోనే దాదాపు 716 బ్లాక్‌స్పాట్‌లపై భద్రతా ఉపశమన చర్యలు అమలుచేశారు. మిగిలిన 1,298 బ్లాక్‌స్పాట్‌లు దీర్ఘకాలిక భద్రతా ఉపశమన చర్యల కోసం అమలులో వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే, రహదారి భద్రతను పటిష్టం చేసేందుకు, ఐదు 'మోడల్ సేఫ్ కన్‌స్ట్రక్షన్ జోన్'లతో పాటు కనీసం 15 కి.మీ పొడవు గల 'మోడల్ సేఫ్ రోడ్' ఐదు విస్తరణలను అభివృద్ధి చేయాలని ఎన్ హెచ్ ఏ ఐ ప్రాంతీయ అధికారులందరినీ కోరింది. అటువంటి పది అత్యుత్తమ భద్రతా సమ్మతి స్ట్రెచ్‌లు/నిర్మాణ జోన్‌లు మూల్యాంకనం చేస్తారు. తదుపరి ప్రతిరూపణ కోసం ప్రదర్శన విస్తరణలుగా గుర్తిస్తారు. జాతీయ రహదారులపై భద్రతను మెరుగుపరచడం అనేది ఎన్ హెచ్ ఏ ఐ అత్యంత ప్రాధాన్యతలలో ఒకటి. ఇది జాతీయ రహదారులపై ప్రయాణికులందరికీ సురక్షితమైన, సజావైన, ప్రయాణ అనుభవాన్ని అందించడానికి కట్టుబడి ఉంది.

# ఆదర్శ పెట్టుబడికి గమ్యస్థానంగా ఉద్భవించిన మధ్యప్రదేశ్: శ్రీ గోయల్

న్యూఢిల్లీ, జనవరి 12:కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజాపంపిణీ మరియు జౌళి శాఖల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈరోజు మధ్యప్రదేశ్‌ను ఒక ఆదర్శ పెట్టుబడి గమ్యస్థానంగా హైలైట్ చేశారు. ఎంపీ పురోగతి మరియు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023లో ఆయన ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.

భారతదేశ శక్తివంతమైన భవిష్యత్తులో పాల్గొనడానికి నేటి శిఖరాగ్ర సదస్సు పరిశ్రమకు అవకాశాన్ని కల్పిస్తుందని శ్రీ గోయల్ అన్నారు. మధ్యప్రదేశ్‌లో ఉన్న అనేక పెట్టుబడి అవకాశాల గురించి శ్రీ గోయల్ మాట్లాడుతూ..ఇది ఆదర్శ పెట్టుబడికి గమ్యస్థానంగా ఆవిర్భవించిందని అన్నారు. రాష్ట్రంలో విస్తారమైన భూమి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన వనరులు ఉన్నాయని అలాగే వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్స్, టూరిజం, టెక్స్‌టైల్స్, రెన్యూవబుల్ ఎనర్జీలో భారీ అవకాశాలను అందిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ ఎంగేజ్‌మెంట్‌లలో కూడా ఎంపిలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారని ఆయన హైలైట్ చేశారు.

ఎంపీ గురించి మాట్లాడుతూ ఇది నూతన భారతదేశ చైతన్యాన్ని ప్రతిబింబించే భారతదేశ హృదయంగా పిలువబడుతుందని అన్నారు. ఇది భారతదేశంలో రెండవ అతిపెద్ద రాష్ట్రం. చాలా వ్యూహాత్మకంగా దేశం మధ్యలో ఉంది. ఉత్తర-దక్షిణ మరియు తూర్పు పశ్చిమ-కారిడార్లు ఎంపీలో ఉన్నాయి. మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో పునరుత్పాదక శక్తి 20 శాతం దోహదపడుతుందని కూడా ఆయన హైలైట్ చేశారు. ఇది ప్రపంచంలోని సేంద్రియ పత్తి ఉత్పత్తిలో 24 శాతానికి దోహదపడుతుందనే వాస్తవం అంతర్జాతీయ మార్కెట్‌లో ఎంపీకి పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది. ఎంపీ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి గత ఏడాది దాదాపు 20 శాతం వృద్ధి చెందిందనీ ఆయన పేర్కొన్నారు.

సుపరిపాలనలో మధ్యప్రదేశ్ వేగంగా అడుగులు వేస్తున్నందుకు శ్రీ గోయల్ ప్రశంసించారు. ఇది త్వరితగతిన పరివర్తన చెందాలనే ప్రధానమంత్రి దృష్టిని నెరవేర్చడానికి పని చేస్తున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ప్రభావాన్ని ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు.

ప్రధానమంత్రి ప్రారంభించిన గ్రీన్ హైడ్రోజన్ మిషన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో అనేక రంగాలలో ముఖ్యంగా గ్రీన్ హైడ్రోజన్ మరియు పునరుత్పాదక ఇంధనంలో భారీ పెట్టుబడులను తీసుకురావడంలో సహాయపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

భారతదేశ బలం దాని రాష్ట్రాలలో ఉందని మరియు భారతదేశం ముందుకు సాగాలంటే రాష్ట్రాలు ముందుకు సాగడం చాలా ముఖ్యమని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చాలా సందర్భాలలో నొక్కిచెప్పారని శ్రీ గోయల్ అన్నారు. రాష్ట్రాలలో అభివృద్ధి మరియు ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడంపై ప్రధాని మోదీ ఎల్లప్పుడూ దృష్టి సారిస్తారని, తద్వారా భారతదేశంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు అపారమైన అవకాశాలను కల్పిస్తారని ఆయన అన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి మద్దతు ఇవ్వడానికి రాష్ట్రాలు బలమైన స్తంభాలుగా ఉంటాయని ప్రధాని మోదీ విశ్వసిస్తున్నారని, 2022 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల సందర్భంగా దేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకోవడంతో దేశం మొత్తం ప్రధానమంత్రితో పాటు కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

శ్రీ గోయల్ తన వ్యాఖ్యలలో అవస్థాపన అభివృద్ధికి దృష్టి కేంద్రీకరించిన విధానం, ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాదిని ఏర్పరుస్తుందన్నారు. ఇది ఎల్లప్పుడూ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా ఉంటుందని సూచించారు. మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించే ఈ ప్రయాణంలో మధ్యప్రదేశ్ కూడా భాగమైందని ఆయన అన్నారు.

సమ్మిట్‌లో ప్రధానమంత్రి ప్రారంభ ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ, ఇందులో ప్రభుత్వం యొక్క వివిధ కార్యక్రమాలు- పిఎం గతి శక్తి, నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మాస్టర్ ప్లాన్, డిజిటల్ ఇండియా గురించి మాట్లాడిన శ్రీ గోయల్ పిఎం శ్రీ నరేంద్ర మోదీ యొక్క దూరదృష్టితో కూడిన నాయకత్వంలో ఇవన్నీ సాధ్యమయ్యాయని అన్నారు. వన్ నేషన్, వన్ టాక్స్, ఐబిసి, వన్ నేషన్ వన్ గ్రిడ్ ఉదాహరణలను ఉటంకిస్తూ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోందన్నారు.

భారతదేశం నేడు ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, ప్రపంచంలోని టాప్ 3 ఆర్థిక వ్యవస్థగా వేగంగా అభివృద్ధి చెందుతోందని శ్రీ గోయల్ అన్నారు.

భారతదేశ జీ20 ప్రెసిడెన్సీ గురించి శ్రీ గోయల్ మాట్లాడుతూ.. భారతదేశం పెరుగుతున్న మన బలాలను మరియు ప్రపంచానికి పెరుగుతున్న సహకారాన్ని ప్రపంచానికి ప్రదర్శించడానికి ఇది సరైన సమయమని అన్నారు. భారతదేశం మరోసారి విశ్వ గురువుగా మారుతోంది మరియు ప్రపంచాన్ని నివసించడానికి సురక్షితమైన ప్రదేశంగా మార్చడానికి చొరవ చూపుతోందని తెలిపారు.

ఎంపీ ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని పేర్కొంటూ.. కొన్ని నెలల క్రితం కునో నేషనల్ పార్క్‌లో పీఎం విడుదల చేసిన చిరుత వేగంతో ఎంపీ ఎదగాలని ఆకాంక్షించారు. కొత్త అవకాశాలతో పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను ఎంపీ మరింత వేగవంతం చేస్తారన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

శ్రీ గోయల్ ఈ రోజు భారతదేశం స్పష్టంగా ప్రపంచంలో ప్రకాశవంతమైన ప్రదేశం అని మరియు మధ్యప్రదేశ్ ముందు నుండి నాయకత్వం వహిస్తుందని మరియు వచ్చే 25 ఏళ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో పాలుపంచుకోవడం కొనసాగించాలని ఆకాంక్షిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# తిరుమలలో సామాన్య భక్తుల గదుల అద్దె పెంచలేదు : టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 12తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులు బస చేసే అద్దె గదుల అద్దె ఏమాత్రం పెంచలేదని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి స్పష్టం చేశారు. వీఐపీల కోసం కేటాయించే గదుల్లో అద్దె వ్యత్యాసం లేకుండా చేసేందుకే నారాయణగిరి, ఎస్వీఆర్‌హెచ్, స్పెషల్ టైప్ విశ్రాంతి గృహాలను ఆధునీకరించి తగిన అద్దె నిర్ణయించామని పేర్కొన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

తిరుమలలో సామాన్య భక్తులపై అధిక భారం మోపారని కొన్ని ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. తిరుమలలో మొత్తం 7500 గదులు ఉన్నాయని, వీటిలో సామాన్య భక్తుల కోసం రూ.50/-, రూ.100/- అద్దెగల గదులు సుమారు 5 వేల వరకు ఉన్నాయని వివరించారు. ఇటీవల ఈ గదుల్లో గీజర్, ఫర్నీచర్, ఫ్లోరింగ్ తదితర ఆధునీకరణ పనులు చేపట్టామని తెలిపారు.

వీటిని భక్తులకు అత్యంత సౌకర్యవంతంగా తీర్చిదిద్దామని, ఇందుకోసం విద్యుత్ చార్జీలు, ఇతర నిర్వహణ ఖర్చులకుగాను రోజుకు రూ.250/- వ్యయం అవుతోందని చెప్పారు. సామాన్య భక్తుల కోసం రూ.100 కోట్లతో పి ఏసి -5 నిర్మిస్తున్నట్టు తెలిపారు. వీఐపీలకు కేటాయించే నారాయణగిరి-1, 2, 3, 4 విశ్రాంతి గృహాలు, ఎస్వీఆర్‌హెచ్, స్పెషల్ టైప్, వివిఆర్‌హెచ్ విశ్రాంతి గృహాల్లోని మొత్తం 170 గదులను గీజర్, ఏసీ, ఉడెన్ కాట్, దివాన్ తదితర వసతులతో రూ.8 కోట్లతో ఆధునీకరించినట్టు వెల్లడించారు.

# స్వామి వివేకానంద గొప్ప స్ఫూర్తి ప్రదాత... రామచంద్రయ్య శర్మ-పాలకుర్తి దేవస్థానం చైర్మన్



మహబూబాబాద్, జనవరి 12 (నేటినిజం ప్రతినిధి): పెద్ద వంగర మండల కేంద్రంలో బలమే జీవనం బలహీనతే మరణం అని జీవిత రహస్యాన్ని యువతకు తెలిపిన ఆదర్శమైన వ్యక్తి స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పాలకుర్తి దేవస్థాన చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ , పెద్ద వంగర మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్ వివేకానంద స్వామి ఫోటోకు పూలమాలవేసి నివాళులు అర్పించారు

. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బొనగిరి లింగమూర్తి ,సీనియర్ నాయకులు నిమ్మల శ్రీనివాస్ ,పెద్దవంగర మండల బి ఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలక బిక్షపతి ,మండల యూత్ ప్రధాన కార్యదర్శి కూతురు అనుదీప్ , నాయకులు ఏదునూరి యాకయ్య ,ఇబ్రహీం ,జలగం మల్లేష్, చెరుకు యాకయ్య, చంద్రమౌళి , కారోబార్ కుమార్ ,యూత్ నాయకులు చిలక సిద్దు ,చిలుక మహేష్ ,దంతాలపల్లి ప్రశాంత్ ,చెరుకు పెద్ద యాకన్న ,ఓరుగంటి మహేష్ ,చిలుక సతీష్, చిలక సురేష్, చిలుక సందీప్, ధర్మారపు విజయ్, చెరుకు సంపత్ తదితరులు పాల్గొన్నారు

# సిటీ బస్ స్టాండ్‌ను ప్రారంభించిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, జనవరి 12: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం పాత బస్ స్టాండ్ ను ఆధునీకరించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సంకల్పించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం సిటీ బస్ స్టాండ్ గా మార్చి నేడు దానిని లాంఛనంగా ప్రారంభించారు.

ఎంతో చరిత్ర కలిగిన ఖమ్మం బస్టాండ్ ను రూ. 50 లక్షలతో ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని మంత్రి పువ్వాడ అన్నారు. అనంతరం సిటీ సర్వీసెస్ లను జెండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్ ను పునరుద్ధరణ చేయడం పట్ల స్థానిక వ్యాపారులు, వివిధ పనుల నిమిత్తం ఖమ్మం వచ్చే ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ భారీ గజ మాలలతో మంత్రి అజయ్ కుమార్ ని సత్కరించారు. వారి వెంట ఎంపి నామా నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

# మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ (ఎంఎస్ సిఎస్) చట్టం 2002 కింద జాతీయ స్థాయిలో బహుళ రాష్ట్ర సహకార సేంద్రియ సొసైటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 12:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం, సంబంధిత మంత్రిత్వ శాఖలు, ముఖ్యంగా వాణిజ్య -పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వ్యవసాయ - రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఆరోగ్య- కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ,ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎం / డోనర్) మద్దతుతో మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ (ఎమ్ ఎస్ సి ఎస్) చట్టం, 2002 కింద సేంద్రీయ ఉత్పత్తుల కోసం జాతీయ స్థాయి సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రోత్సహించే చారిత్రాత్మక నిర్ణయానికి ఆమోదం తెలిపింది. ఈ మంత్రిత్వ శాఖలు వాటి విధానాలు, పథకాలు,ఏజెన్సీల ద్వారా 'మొత్తం ప్రభుత్వ విధానాన్ని' అనుసరిస్తాయి.

సహకార్ - సే-సమృద్ధి దార్శనికతను సాకారం చేయడానికి సహకార సంఘాల బలాలను సద్వినియోగం చేసుకోవడానికి, వాటిని విజయవంతమైన ,శక్తివంతమైన వ్యాపార సంస్థలుగా మార్చడానికి అన్ని ప్రయత్నాలు జరగాలని ప్రధాన మంత్రి.అన్నారు. అందువల్ల సహకార సంఘాలు అంతర్జాతీయ దృక్పథం తో ఆలోచించడం, తులనాత్మక ప్రయోజనాన్ని పొందడానికి స్థానికంగా వ్యవహరించడం అత్యవసరం.

అందువల్ల, సేంద్రీయ రంగానికి సంబంధించిన వివిధ కార్యకలాపాలను నిర్వహించడానికి గొడుగు సంస్థగా వ్యవహరించడం ద్వారా సహకార రంగం నుండి సేంద్రీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఎంఎస్ సిఎస్ చట్టం, 2002 లోని రెండవ షెడ్యూల్ కింద జాతీయ స్థాయి సహకార సంఘాన్ని రిజిస్టర్ చేస్తారు.

ప్రాథమిక సంఘాలు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఫెడరేషన్లు, మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓ లు) సహా ప్రాథమిక నుంచి జాతీయ స్థాయి సహకార సంఘాల వరకు ఇందులో సభ్యత్వం ఉంటుంది. ఈ సహకార సంఘాలన్నీ వాటి ఉప-చట్టాల (బై లాస్)ప్రకారం సొసైటీ బోర్డులో తమ ఎన్నికైన ప్రతినిధులను కలిగి ఉంటాయి.

సర్టిఫైడ్ , ప్రామాణిక సేంద్రియ ఉత్పత్తులను అందించడం ద్వారా సహకార సంఘం సేంద్రీయ రంగానికి సంబంధించిన వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తుంది. ఇది దేశీయ ,ప్రపంచ మార్కెట్లలో సేంద్రీయ ఉత్పత్తుల డిమాండ్, వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహద పడుతుంది.

సహేతుక ధరలో పరీక్షలు ,ధృవీకరణను సులభతరం చేయడం ద్వారా పెద్ద ఎత్తున అగ్రిగేషన్, బ్రాండింగ్ ,మార్కెటింగ్ ద్వారా సేంద్రీయ ఉత్పత్తుల అధిక ధర ప్రయోజనాలను పొందడంలో సహకార సంఘాలకు ,అంతిమంగా వారి రైతు సభ్యులకు ఈ సొసైటీ సహాయ పడుతుంది.

సహకార సంఘం అగ్రిగేషన్, సర్టిఫికేషన్, టెస్టింగ్, సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, బ్రాండింగ్, లేబులింగ్, ప్యాకేజింగ్, లాజిస్టిక్ సదుపాయాలు, సేంద్రీయ ఉత్పత్తుల మార్కెటింగ్ కు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు / రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓ లు) తో సహా సభ్య సహకార సంఘాల ద్వారా సేంద్రీయ రైతులకు ఆర్థిక సహాయం ఏర్పాటు చేయడానికి సంస్థాగత మద్దతును కూడా అందిస్తుంది. వివిధ ప్రభుత్వ పథకాలు,ఏజెన్సీల ద్వారా

సేంద్రీయ ఉత్పత్తుల ప్రచారం ,అభివృద్ధి సంబంధిత కార్యకలాపాలను కూడా ఈ సహకార సంఘం నిర్వహిస్తుంది. ఇది గుర్తింపు పొందిన సేంద్రీయ పరీక్షా ప్రయోగశాలలు, సర్టిఫికేషన్ సంస్థలను ఎంపానెల్ చేస్తుంది, పరీక్ష ,ధృవీకరణ ఖర్చును తగ్గించడానికి సొసైటీ సూచించిన ప్రమాణాలను కలిగి ఉంటుంది.

సహకార సంఘాలు ,సంబంధిత సంస్థలు ఉత్పత్తి చేసే సేంద్రియ ఉత్పత్తుల మొత్తం సరఫరా గొలుసును సభ్య సహకార సంఘాల ద్వారా సొసైటీ నిర్వహిస్తుంది, ఇది ఎంఎస్ సిఎస్ చట్టం, 2002 కింద ఏర్పాటు చేయబడిన జాతీయ సహకార ఎగుమతి సొసైటీ సేవలను ఎగుమతి మార్కెటింగ్ కోసం ఉపయోగిస్తుంది. తద్వారా ప్రపంచ మార్కెట్ లో సేంద్రీయ ఉత్పత్తుల చేరిక ,డిమాండ్ ను పెంచుతుంది. సేంద్రియ ఉత్పత్తిదారుకు సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణ, సామర్థ్య పెంపు తో పాటు సేంద్రీయ ఉత్పత్తుల కోసం ప్రత్యేక మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ను కూడా నిర్వహిస్తుంది. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో సాధారణ సామూహిక వ్యవసాయం , సేంద్రీయ వ్యవసాయం మధ్య సమతుల్య విధానాన్ని పాటిస్తుంది.

# మళ్లీ తెలంగాణకు వస్తా.. అందరితో మాట్లాడతా : మాణిక్‌రావు థాక్రే

హైదరాబాద్, జనవరి 12:ఈ నెల 20న మళ్లీ తెలంగాణకు వస్తానని, మూడు రోజుల పాటు ఇక్కడే ఉంటానని కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావు థాక్రే అన్నారు. మరోసారి అందరితో మాట్లాడతానని, హాత్ సేహాత్ జోడోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాత్ర కోసం కమిటీలు వెంటనే పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడానికి అందరూ ఐక్యంగా పనిచేయాలన్నారు.

# అయ్యప్ప స్వామి ప్రసాదం అమ్మకాల్ని వెంటనే ఆపేయాలి

## - కేరళ హైకోర్టు తాజాగా ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డుకు ఆదేశాలు జారీ

కేరళ జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అయ్యప్ప స్వామి ప్రసాదం అమ్మకాల్ని వెంటనే ఆపేయాలని కేరళ హైకోర్టు తాజాగా ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో.. శబరిమలలో అరవణ ప్రసాదం అమ్మకాలు నిలిచిపోయాయి. ఎందుకిలా జరిగింది? అసలేమైంది? అన్నది ప్రశ్నకు కోర్టును ఆశ్రయించిన పిటిషన్ దారులు సమాధానం చెప్పేస్తున్నారు. అరవణ ప్రసాదంలో వినియోగించే యాలకుల్లో పరిమితికి మించి రసాయనాలు వినియోగించారన్న నివేదికతో హైకోర్టు ఈ ఉత్తర్వులను జారీ చేసింది.అయ్యప్ప స్వామి దీక్షను పూని నిష్ఠగా శబరిమలకు వెళ్లే లక్షలాది మంది స్వాములు మాత్రమే కాదు.. దీక్ష తీసుకోకుండానే స్వామివారిని దర్శించుకునే వారంతా తప్పనిసరిగా తమతో తెచ్చుకునే ప్రసాదం ఏమైనా ఉందంటే.. అది స్వామివారి ప్రసాదంగా చెప్పే 'అరవణ ప్రసాదం'గా చెప్పాలి. శబరిమల నుంచి ఎంతో పవిత్రంగా తీసుకొచ్చే ఈ ప్రసాదాన్ని ఇంటికి వచ్చిన తర్వాత తమకు తెలిసిన వారందరికి పంచే అలవాటు తెలిసిందే.అయితే.. యాలకుల్ని వినియోగించకుండా ప్రసాదాన్ని తయారు చేయొచ్చన్న సూచనను చేసింది. అరవణ ప్రసాదంలో వినియోగించే యాలకుల్నిగతంలో 'అయ్యప్ప స్పైసెస్' అనే సంస్థ నుంచి ట్రావెన్ కోర్ బోర్డు కొనుగోలు చేసేది. అందుకు భిన్నంగా ఇటీవల మరో కాంట్రాక్టర్ కు యాలకుల్ని సప్లై చేసే బాధ్యతల్ని అప్పజెప్పింది. ఈ నేపథ్యంలో యాలకుల నాణ్యతపై అయ్యప్ప స్పైసెస్ సంస్థ కంప్లైంట్ చేయటంతో అధికారులు ల్యాబ్ లో నాణ్యత పరీక్షల్ని నిర్వహించారు.అందులో మోతాదుకు మించిన రసాయనాలు వాడినట్లుగా తేలింది. ఇటీవల సరఫరా చేసిన యాలకుల్లో 14 రకాల రసాయనాలు మోతాదుకు మించి ఉన్నట్లుగా నివేదిక వచ్చింది. దీని ఆధారంగా చేసుకొని హైకోర్టును ఆశ్రయించారు.దీంతో.. ఇప్పటివరకరు తయారు చేసిన అరవణ ప్రసాదం అమ్మకాల్ని నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేస్తూ.. యాలకులు లేకుండా ప్రసాదాన్ని తయారు చేయొచ్చని సూచన చేసింది. దీంతో.. యాలకుల్ని మినహాయించి అరవణ ప్రసాదాన్ని తయారు చేసినంతనే అమ్మకాల్ని చేపడతారు. ఈ నేపథ్యంలో.. ఇటీవల కాలంలో అయ్యప్ప ప్రసాదాన్ని తీసుకొచ్చి.. ఇంట్లో ఉంచుకున్న వారు కానీ.. బంధువుల నుంచి ప్రసాద డబ్బాల్ని తమతో నిల్వ ఉంచుకున్నవారు కానీ వాటిని వాడకపోవటమే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కేసీఆర్ నాయకత్వంలో బంగారు తెలంగాణ .. ఉప్పల శ్రీనివాస్ గుప్తా




హైదరాబాద్, జనవరి 12:తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బంగారు తెలంగాణకు బాటలు వేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. హైదరాబాద్ లోని బొగ్గుల కుంట, తిలక్ రోడ్, లోని తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో రవి శ్రీ ఆధ్వర్యంలో జరిగిన ప్రీమియర్ అవార్డ్స్ 2022-2023 ప్రదానోత్సవం కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రీమియర్ అవార్డులను అందజేశారు. అనంతరం ఆయనను సన్మానించారు.

ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. గత ఏడున్నర సంవత్సరాలుగా సంక్షేమంలో దేశంలో నెంబర్ వన్ గా ఉన్నామన్నారు. ఆడ బిడ్డలను గౌరవించే సంస్కృతి మన తెలంగాణదన్నారు. మహిళల భద్రత కోసం షీ టీమ్, కార్యక్రమాన్ని, ఆడబిడ్డల పెళ్లి కోసం కళ్యాణ లక్ష్మి పథకం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇప్పుడు ఆడపిల్ల పుడితే లక్ష్మి పుట్టిందనుకుంటున్నారు. మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందామన్నారు. ఇలాంటి సందేశాత్మక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమాజ సేవకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ శ్రీనివాస్, టెలివిజన్ రవి శ్రీ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జోషీమఠ్ నుంచి సైనిక దళాల్ని తరలించాం: ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే

న్యూఢిల్లీ, జనవరి 12: ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో భూమి కుంచించుకుపోతున్న విషయం తెలిసిందే. దీంతో అక్కడ ఉన్న సైనిక దళాల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఇవాళ ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే తెలిపారు.

ఎంత మంది సైనికుల్ని తరలించారన్న దానిపై ఆయన క్లారిటీ ఇవ్వలేదు. కానీ జోషీమఠ్ ప్రాంతంలో ఉన్న సుమారు 20 సైనిక క్షేత్రాలు స్వల్ప స్థాయిలో డ్యామేజ్ అయినట్లు ఆయన వెల్లడించారు. అవసరమైతే మరికొన్ని దళాల్ని కూడా సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని ఆయన చెప్పారు.

చైనాతో ఉన్న సుమారు 3488 కిలోమీటర్ల బోర్డర్‌ను రక్షించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆర్మీ చీఫ్ తెలిపారు. లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ వద్ద దాదాపు 20 వేల మంది సైనికులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆ ప్రాంతంలో మిలిటరీ హార్డ్‌వేర్‌తో పాటు ఆర్టిల్లరీ, మిస్సైల్ సిస్టమ్స్ కూడా ఉన్నాయి.

జోషీమఠ్‌లో అనేక ఇండ్లలో పగుళ్లు వచ్చాయి. దీంతో అక్కడ నుంచి ప్రజల్ని తరలించారు. సీఎం పుష్కర్ సింగ్ ధామి అక్కడ ఓ రోజు బస కూడా చేశారు. ఇక కొన్ని హోటళ్లను కూల్చివేయాలని కూడా నిర్ణయించారు. అయితే స్థానికులు దాఖలు చేసిన పిటిషన్‌ను జనవరి 16వ తేదీన విచారించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

# ముగ్గుల పోటీలు సాంప్రదాయాలకు ప్రతీకలు- ఉప్పల శ్రీనివాస్ గుప్తా




హైదరాబాద్, జనవరి 12:ముగ్గుల పోటీలు సంస్కృతికి, సాంప్రదాయాలకు ప్రతీకలు అని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. హైదరాబాద్ లోని, ఐసిఐసిఐ బ్యాంక్ పక్క లైన్ చైతన్యపురిలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్-ఐవీఎఫ్ స్టేట్ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులుగా చీరలను అందజేశారు. అలాగే పాల్గొన్న అందరికీ కూడా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. మహిళలు ఉదయం పూట ఇళ్ళ ముందు ముగ్గులు వేయడం మంచి వ్యాయామమన్నారు. దీంతోపాటు మహిళల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ముగ్గుల పోటీలు ఐక్యతకు, ఆప్యాయతకు నిదర్శనమన్నారు.మన తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. సంక్రాంతి పండుగ ప్రకృతి పండుగ అని తెలిపారు. సాంస్కృతిక అంశాలు మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి, ఏకాగ్రతకు ఎంతగానో దోహదపడుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో.. గంజి రాజమౌళి గుప్త ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్-ఐవీఎఫ్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ న్యూఢిల్లీ, ఐవీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్ర శేఖర్, ఐవీఎఫ్ మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, ఐవీఎఫ్ తెలంగాణ స్టేట్ కోశాధికారి కొడిప్యాక నారాయణ గుప్తా, ఐవీఎఫ్ మహిళా విభాగం అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, సెక్రటరీ లెంకల పల్లి మంజుల రాజు, ట్రెజరర్ గుడిపాటి భువనేశ్వరి, చీఫ్ అడ్వైసర్ కలకొండ మణిమాల, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) మహిళా విభాగం సభ్యులు, ఐవీఎఫ్ నాయకులు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

## -ఓబన్న జయంతిని ప్రభుత్వము అధికారికంగా నిర్వహించాలని డిమాండ్




హైద్రాబాద్ 12 జనవరి (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఈరోజు రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్,గాంధీ నగర్ లలో స్వతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న 216జయంతి ని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలోవడ్డెర సంఘం మరియు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డె ఓటన్న బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కి యుద్ధ యోధుడు గా, పదివేల మందికి సైన్యదిపతిగా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం భూమి శిస్తు ద్వారా పండిన పటకంటే వసూలు చేసే శిస్తు అధికం గా వుండేది. పన్ను కట్టని రైతుల దన మాన, ప్రాణాలను హరించేవారు బ్రిటిష్ వారు. అటువంటి దారుణ పరిస్తితుల్లో వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన పోరాటయోధుడన్నారు. వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వము అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

# యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




మెదక్, జనవరి 12 నేటినిజం (ప్రతినిధి):సనాతన ధర్మాన్ని యావత్ ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గురువారం పటాన్ చెరు పట్టణంలోని వివేకానంద కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. స్వామి వివేకానంద తన ప్రసంగాల ద్వారా యువతలో స్ఫూర్తి నింపడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గొప్పతనాన్ని చాటి చెప్పారని కొనియాడారు. ఆయన పుట్టిన రోజును దేశ వ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు.

# యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జనవరి 12: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణం లో యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 160 వ జయంతి సందర్భంగా (జాతీయ యువజన దినోత్సవం జనవరి -12) సందర్భంగా వివేకానంద చిత్ర పటానికి పూల మాల వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ రాజశేఖర్ మాట్లాడుతూ యువత కు స్ఫూర్తి ప్రధాత స్వామి వివేకానంద అని, నాటికీ నేటికీ, భవిష్యత్తు తరాలకు ఆయన అందించిన మార్గం యువతకు ఆదర్శం అని, యువత అనుకుంటే సాధించలేనిది ఏది లేదని,భారత దేశ కీర్తి ని పెంచిన గొప్ప వ్యక్తి అని, వివేకానంద ను స్ఫూర్తి గా తీసుకొని యువత ఉన్నత లక్ష్యాలు సాధించాలి అని కోరారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు బొంగాని శ్రీకాంత్, ఫౌండేషన్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సంక్రాంతి సంబురాలు




రాజన్న సిరిసిల్ల, జనవరి 12: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి సంబరాలలో భాగంగా పాఠశాల ప్రాంగణమంతా విద్యార్థులు వేసిన రంగవల్లుల తో మరియు గొబ్బెమ్మలతో సప్తవర్ణ శోభితంగా మారింది.విద్యార్థులు హరిదాసుల వేషాలలో చేసిన కీర్తనలు, చిన్నారులను దీవించే కార్యక్రమం భోగిపళ్ళు . భోగిమంటలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి కరస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ, ప్రధానోపాధ్యాయులు కళ్యాణ్ కుమార్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటకృష్ణ, ప్రిన్సిపాల్ కళ్యాణ్ కుమార్ ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు

# అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా బీఆర్ఎస్ : మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, జనవరి 12 అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చిరునామాగా నిలుస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి పట్టణంలో గురువారం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా రూ. 70 కోట్లతో పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. పేద ప్రజల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిస్తున్నారని అన్నారు.

### స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఎల్ఎమ్ కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సహకారంతో ధర్మపురి జూనియర్ కళాశాల మైదానం నిర్వహించిన ఎమ్మెల్యే రోలింగ్ క్రికెట్ టోర్నీని మంత్రి ప్రారంభించారు. దాదాపు 50 రోజుల పాటు జరిగే టోర్నమెంట్‌లో క్రీడాకారులు సోదరభావంతో మెలిగి గెలుపు, ఓటములను సమానం స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేశ్ నేత, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కరీంనగర్ డీసీఎంఎస్ చైర్మన్ డాక్టర్ ఎల్లా శ్రీకాంత్ రెడ్డి , జడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 1ను సస్పెండ్ చేసిన ఏపీ హైకోర్టు- సిఎం జగన్ కు బిగ్ షాక్

అమరావతి జనవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: "ప్రజాస్వామ్యాన్ని నువ్వు కాపాడు.. నిన్ను ప్రజాస్వామ్యం కాపాడుతుంది. నువ్వే ప్రజాస్వామ్యాన్ని చంపేస్తే ఆ తర్వాత నిన్ను కాపాడటానికి ఆ ప్రజాస్వామ్యం బతికి రాదు" ఓ హక్కుల కార్యకర్త అన్న మాటలివి. 1861 పోలీస్ యాక్ట్ లోని సెక్షన్ 30 ప్రకారం నేతల ప్రదర్శనలు, కార్యక్రమాలపై ఏపీ ప్రభుత్వం నిషేధం విధించింది. చీకటి జీవో నెంబరు 1ను తక్షణమే రద్దుచేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలోనే జీవో నెంబర్ 1ను ఏపీ హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ నెల 23 వరకూ న్యాయస్థానం సస్పెన్షన్ విధించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 20కి హైకోర్టు వాయిదా వేసింది. జీవో 1 సవాల్ చేస్తూ హైకోర్టులో సీపీఐ రామకృష్ణ పిటిషన్ దాఖలు చేశారు. ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులను కాలరాసేలా జీవో 1 ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. జీవో 1ను కొట్టివేయాలంటూ న్యాయస్థానాన్ని రామకృష్ణ అభ్యర్థించారు. రామకృష్ణ తరపున లాయర్ అశ్వినీకుమార్ వాదించారు. ఏపీ ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ వాదించారు. ఇరువాదనలు విన్న హైకోర్టు.. జీవో 1పై ఈ నెల 23 వరకూ సస్పెన్షన్ విధించింది.

సీఎం జగన్ నూతన సంవత్సర కానుక.. కొత్త ఏడాదిని విపక్షాలపై ఉక్కుపాదంతో ఆయన ప్రారంభించారు. రోడ్లపై ర్యాలీలు, రోడ్ షోలు చేపట్టరాదంటూ రాష్ట్ర హోం శాఖ గుట్టుగా ఉత్తర్వులు జారీచేసింది. జాతీయ రహదారులు మొదలుకొని పట్టణ, గ్రామీణ పంచాయతీ రోడ్ల మీద కూడా జనం గుమిగూడేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. అలాగే మున్సిపల్ రోడ్లు, కూడళ్ల వద్దకు సైతం జనం గుంపుగా రావడానికి వీల్లేదని తెలిపింది. 30 పోలీసు యాక్టుకు పదునుపెడుతూ ఈ ఆదేశాలిచ్చింది. ఏపీలో పోలీసుల బాధ్యతలు, విధులు, అధికార పరిమితులపై చంద్రబాబు ప్రభుత్వం ఏపీ పోలీస్ రిఫామ్స్ యాక్ట్-2014 తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఈ చట్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇదే అమలవుతోంది. కానీ... జగన్ సర్కారు ఉన్నట్టుండి 1861 చట్టం బూజు దులిపింది. దానిని ఉటంకిస్తూ అర్ధరాత్రి జీవో తీసుకొచ్చింది. నిజానికి... 1861 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటే ఇలా ప్రత్యేకంగా జీవో ఇవ్వాల్సిన అవసరమే లేదు. చట్టాన్ని ఇప్పుడు అమలులోకి తీసుకొస్తేనే ఇలా జీవో ఇవ్వాలి. అంటే... 162 సంవత్సరాల కిందట బ్రిటిష్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని, మనకు స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలకు జగన్ సర్కారు అమలులోకి తెచ్చిందన్న మాట. అప్పటికీ, ఇప్పటికీ ఒకటే తేడా. నాడు... స్వాతంత్రోద్యమంపై ఉక్కుపాదం మోపడం బ్రిటిష్ పాలకుల లక్ష్యం. నేడు... ప్రతిపక్షాల గళాన్ని అడ్డుకోవడం జగన్ సర్కారు లక్ష్యం.

### గెజిట్‌లో పెట్టకున్నా...

పాత చట్టాల్లోని అంశాలను ఏ రాష్ట్రమైనా అమలు చేయాలనుకుంటే... అందుకు గెజిట్ జారీ చేయాలి. తాజా చీకటి జీవోను ఇంకా గెజిట్‌లో పెట్టనే లేదు. కానీ అది అమల్లోకి వచ్చేసిందని కుప్పంలో చంద్రబాబు పర్యటనకు అనుమతి నిరాకరించడం గమనార్హం! . పైగా... 'అనేక సంఘటనలు జరుగుతున్నందునే ఈ జీవో తీసుకొచ్చాం' అని ప్రభుత్వం పేర్కొంది. నిజానికి... ఇటీవల కందుకూరులోనే అలాంటి విషాదం చోటు చేసుకుంది. గుంటూరులో జరిగిన ఘటన ఈ కోవలోకి రాదు. అయినా సరే... ఈ సంఘటనలను అడ్డం పెట్టుకుని, మొత్తం ప్రతిపక్షాల ర్యాలీలపైనే గురిపెట్టారు.

# విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలి ప్రిన్సిపల్ సుదేష్ కుమారి

## - ఒలంపియాడ్ పరీక్షల్లో ర్యాంక్ సాధించిన 39 విద్యార్థులు




రాజన్న సిరిసిల్ల, జనవరి 12: (నేటినిజం ప్రతినిధి): భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే పాఠశాలలో విద్యలో మరింత శ్రద్ధతో చదువుకోవాలని శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సుదీష్ కుమారి అన్నారు.

వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల లోని విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలో 39 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటి విజయం సాధించారు. గురువారం స్కూల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సు దే ష్ కుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక సబ్జెక్టులో నైపుణ్యం ఉంటుందని, దానిని విద్యార్థి సాధన చేసినప్పుడే అది బయటపడుతుందని, అందుకు ప్రతి ఒక్కరు కృషిచేసి వారిలో ఉన్న తెలివితేటలను చూపించాలని అన్నారు. ఇలాంటి మరెన్నో పోటీ పరీక్షల్లో పాల్గొని మంచి విజయాలు సాధించి భవిష్యత్తులో గొప్ప స్థాయిలో ఎదగాలని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణరావు, రీజినల్ ఇన్చార్జి ముద్రకొల రాజు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ పీ శేఖర్, ఒలంపియాడి ఇంచార్జ్ కె ఏం.శైలజ, ఏవో ఏ. సుధీర్, విద్యార్థిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 11 నుంచి శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

అమరావతి: జనవరి 12: శ్రీశైలం దేవస్థానంలో ఫిబ్రవరి 11 నుంచి 21 వ తేదీ వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. లవన్న తెలిపారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కృష్ణ దేవరాయగోపురం, నాగులకట్ట, అమ్మవారి ఆలయం , కల్యాణ మండపం, శ్రీస్వామివారి నిత్య కల్యాణ మండప ప్రాంగణాన్ని పరిశీలించారు.

ఉత్సవ రోజుల్లో స్వామివారి ఆలయ ముఖ మండపంలో భక్తుల కోసం మరొక క్యూలైన్ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం క్యూలైన్లకుంటే కొంచెం ఎత్తులో మరో క్యూలైన్ ఏర్పాటు చేసే భక్తులు ఎక్కువ సమయం వేచియుండ కుండా స్వామివారిని సులువుగా దర్శించుకుంటారని ఆయన వెల్లడించారు. వీవీఐపీలకు, వీఐపీలకు వేర్వేరుగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. మహాశివరాత్రి రోజున కల్యాణ కట్ట వద్ద శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# దివంగత నేత రామన్నగారి రాజేశ్వర్ గౌడ్,(చిలుక రాజు) 61వ జయంతి సందర్భంగా విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించిన చిలక రాజు తనయుడు



మేడ్చల్ జిల్లా, జనవరి 12:(నేటినిజం ప్రతినిధి): మేడ్చల్ మాజీ సర్పంచ్ దివంగత నేత రామన్నగారి రాజేశ్వర్ గౌడ్,(చిలుక రాజు) 61వ జయంతి సందర్భంగా మేడ్చల్ పట్టణంలో ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు.

చిలక రాజు తనయుడు మేడ్చల్ మున్సిపాలిటీ ఆరో వార్డు కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ గౌడ్ సొంత నిధులతో తన తండ్రి జన్మదిన సందర్భంగా 6వ వార్డులో ఐదు లక్షల రూపాయలతో సీసీ కెమెరాలు,2లక్షల రూపాయలతో నాణ్యమైన విద్యుత్ సర్వీస్ వైర్లను 400దల మీటర్ల మేర ఏర్పాటు చేయించారు,

వార్డు పరిధిలో పటిష్టమైన వీధి దీపాలను ఏర్పాటు చేసి స్థానిక సి ఐ రాజశేఖర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లచే ప్రారంభించారు...

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలనీలో జరుగుతున్న దొంగతనాల దృశ్య కాలనీవాసులు కోరిక మేరకు వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎల్లవేళలా పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని కౌన్సిలర్ మణికంఠ గౌడ్ అన్నారు..ఈ సందర్భంగా తండ్రి జయంతి పురస్కరించుకొని పేద ప్రజలకు మేడ్చల్ మెయిన్ మార్కెట్ లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు..

ఈ కార్యక్రమంలో చిలకరాజ అభిమానులు కౌన్సిలర్లు మేడ్చల్ పట్టణవాసులు పాల్గొన్నారు..

# స్వామి వివేకానంద ఆశయాలు ఆదర్శనీయం

## -ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్

రాజన్న సిరిసిల్ల, జనవరి 12: (నేటినిజం ప్రతినిధి): స్వామి వివేకానంద ఆశయాలు నేటి




తరానికి ఆదర్శనీయమని వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏవి ప్రమోద్ కుమార్ అన్నారు.వేములవాడ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వామి వివేకానంద ఆశయాలు స్ఫూర్తిగా తీసుకొని యువత ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ అంజయ్య అధ్యాపకులు ముత్యాల మహేందర్ రెడ్డి , శేఖర్, జయభారత్ రెడ్డి, సంతోష్ , దేవయ్య, శ్రీనివాస రావు, లత, మంగమ్మ, జ్యోతి, ఆఫీస్ సిబ్బంది ఉడుతల రాము పాల్గొన్నారు.

# కిడ్స్ కాన్వెంట్ స్కూల్ లో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు




రాజన్న సిరిసిల్ల, జనవరి 12: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సంబరాలలో భాగంగా విద్యార్థినిలు అందమైన సాంప్రదాయ దుస్తులు ధరించి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను సంక్రాంతి పండగ వైభవాన్ని వారి రంగవల్లుల్లో చూపించారు. భోగి మంటలు,గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల నృత్యాలు ,పిండివంటలు, బొమ్మల కొలువులు అందంగా ఏర్పాటు చేసి పిల్లలు స్వయంగా తయారుచేసిన పతంగులను ఎగురవేయడం జరిగింది.ఆనంతరం ప్రిన్సిపల్ ద రక్షన్ వ సు ఫియా మాట్లాడుతూప్రతి పండగలో సంస్కృతితో పాటు శాస్త్రీయత దాగి ఉన్నదని అన్నారు.సంక్రాంతి పండగ ప్రకృతి పండగ అని సాంస్కృతిక అంశాలు మానసిక వికాసానికి శారీరక ఆరోగ్యానికి,ఏకాగ్రతకీ ఎంతగానో దోహద పడుతాయని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక, వివిధ పండుగలకు సూచించే కార్యక్రమాలను విశేషంగా చేపడతామని తెలుపుతూ పాఠశాల విద్యార్థుల ప్రతి పర్వదినాన్ని పురస్కరించుకొని విశేషంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. అందులో భాగంగా నేడు పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు జరుపుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పసివుల్లా, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# నిత్యజీవిత సమస్యలే మనకు పరిష్కారం చూపెడతాయి-కలెక్టర్ అనురాగ్ జయంతి

## -జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు,టీచర్లకు కలెక్టర్, విద్యాధికారి అభినందనలు



రాజన్న సిరిసిల్ల, జనవరి 12: (నేటినిజం ప్రతినిధి): నిర్మల్ లో జనవరి తొమ్మిది నుండి గత మూడు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ మానక్-జవాహర్ లాల్ నెహ్రూ సైన్స్ ఎగ్జిబిషన్ లో రాజన్న సిరిసిల్ల విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆనందం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లా విద్యాధికారి, విద్యార్థులు, గైడ్ టీచర్లు,ప్రధానోపాధ్యాయులు, మరియు సైన్స్ అధికారి కలెక్టర్ గారిని కలిసినపుడు విద్యా శాఖకి అభినందనలు తెలిపారు.ఈ సందర్భముగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారు తయారు చేసిన ప్రాజెక్ట్ ల గురించి అడిగి తెలుసుకున్నారు. వారు ఎంచుకున్న అంశములు దైనందిన జీవితం లో ఎంతో ఉపయోగకరమైనవని అన్నారు. నిజ జీవితం లో ఎదురయ్యే సమస్యలే వారికి పరిష్కారం చూపెడతాయని అన్నారు. జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ జిల్లా నుండి 3ఎగ్జిబిట్స్ నేషనల్ కి,2 సౌత్ ఇండియా లెవెల్ కి ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేసారు ఎగ్జిబిట్స్ లో మార్పులు చేయుటకు నిపుణుల సలహాలు తీసుకొని జాతీయ స్థాయిలో ఎంపిక అయ్యేటట్లు చూడాలని కోరారు.ఈ కార్యక్రమం లో డివో డాక్టర్ రాధాకిషన్, సైన్స్ అధికారి పాముల దేవయ్య , ప్రధానోపాధ్యాయులు నాగుల భాగ్యరేఖ,నారాయణ గైడ్ టీచర్లు మహేష్ చంద్ర,దోర్నాల భూపాల్ రెడ్డి,కిషన్, నవీన్,విద్యార్థులు సమర్థ,వినీల,జంకే శ్రీనిధి,పండుగ సహస్ర లు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.